JAYABHERIDAILY.COM

ప్రభాత

# జయభేరి

తెలుగు దినపత్రిక

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

మేడ్చల్ - మల్కాజిగిరి । శుక్రవారం 21-11-2025
Medchal - Malkajgiri I Friday 21-11-2025

jayabherinews

సంపుటి : 02 । సంచిక : 175 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 I Issue 175 I Pages : 8 I ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889
call me

jayabheripaper@gmail.com





# 10వ సారి సీఎంగా ప్రమాణం

- నితీశ్ కుమార్ నేతృత్వంలోని కూటమి ఏకంగా 202 సీట్లను కైవసం
- మౌనదీక్ష చేపట్టిన పీకే
- ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా నితీశ్‌కు శుభాకాంక్షలు

**జయభేరి, పాట్నా, నవంబర్ 20 :**

జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా పదోసారి ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు. పాట్నాలోని గాంధీ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా పలువురు జాతీయ నేతలు హాజరయ్యారు. నితీశ్ కుమార్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టారు.ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గాను, నితీశ్ కుమార్ నేతృత్వంలోని కూటమి ఏకంగా 202 సీట్లను కైవసం చేసుకుంది. ఇందులో బీజేపీ 89 స్థానాల్లో గెలుపొందగా, జేడీయూ 85 స్థానాల్లో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఏర్పాటైన కొత్త మంత్రివర్గంలో బీజేపీ నుంచి 14 మందికి, జేడీయూ నుంచి 9 మందికి చోటు దక్కింది.నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లుగా బీహార్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతున్నారు. 2000 సంవత్సరంలో తొలిసారి సీఎంగా ఏడు రోజులు మాత్రమే పనిచేసిన ఆయన, ఇప్పుడు పదోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా నితీశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. "రాజకీయాల్లో ఎంతో అనుభవం, రాష్ట్రానికి మంచి పాలన అందించిన అద్భుతమైన రికార్డు నితీశ్‌కు ఉంది" అని ఆయన కొనియాడారు.

**మౌనదీక్ష చేపట్టిన పీకే**

రాజకీయ వ్యూహకర్త నుంచి నాయకుడిగా మారిన ప్రశాంత్ కిశోర్ (పీకే) ఒక రోజు మౌన దీక్ష చేపట్టారు. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన స్థాపించిన జన్ సూరజ్ పార్టీ ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో ఆత్మపరిశీలన కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు.

...మిగతాది 2 లో

కేసు విచారణలో భాగంగా 2025 సెప్టెంబర్ 9న ఏసీబీ తన ఫైనల్ రిపోర్ట్‌ను ప్రభుత్వానికి సమర్పించింది. దీనిలో కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్ చేయడానికి గవర్నర్ అనుమతి కోరింది. 2025 సెప్టెంబర్‌లో ఏసీబీ గవర్నర్‌కు అనుమతి కోరిన తర్వాత, ఇన్ని రోజులకు ఆయన ఆమోదం తెలిపారు.



# చిక్కుల్లో కేటీఆర్

- కేటీఆర్ పై విచారణకు గవర్నర్ అనుమతి
- ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌పై చార్జిషీట్‌కు గవర్నర్ అనుమతి
- బీజేపీ, కాంగ్రెస్‌పై స్పందించిన ఎమ్మెల్సీ కవిత
- కేసులు పెట్టడం తప్ప బీజేపీకి మరో పనిలేదని విమర్శ
- సంక్షేమ పథకాలు అమలు చేయలేకే కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని మండిపాటు

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 20:**

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో పెద్ద షాక్ తగిలింది. హైదరాబాద్‌లో జరిగిన ఫార్ములా E రేసు కేసులో అవినీతి ఆరోపణలపై కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్ చేయడానికి తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఏసీబీ ఈ కేసులో కేటీఆర్‌ను A1గా చూపిస్తూ త్వరలోనే చార్జ్‌షీట్ దాఖలు చేయనుంది. ఈ కేసు దర్యాప్తు 2024 డిసెంబర్‌లో ప్రారంభమైంది. కేటీఆర్ ఇప్పటికే నాలుగుసార్లు విచారణను ఎదుర్కొన్నారు. హైదరాబాద్‌లో 2023లో జరిగిన ఫార్ములా E ఎలక్ట్రిక్ కార్ రేసు ఈవెంట్‌కు సంబంధించిన అవినీతి ఆరోపణలే కేటీఆర్‌పై కేసు పునాది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేటీఆర్ ఈ ఈవెంట్‌ను హైదరాబాద్‌కు తీసుకురావడానికి కాంట్రాక్టులు ఒకే కంపెనీకి ఇచ్చినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ కంపెనీ తరపున బీఆర్ఎస్ పార్టీకి 50 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చారని, ఇది 'క్విడ్ ప్రోకో'

...మిగతాది 2 లో



# అనిల్ అంబానీ ఆస్తులు1400 కోట్లు సీజ్

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 20:**

కేంద్ర దర్యాప్తు సంస్థ ED (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) అనిల్ అంబానీకి చెందిన ADAG గ్రూప్ కంపెనీలపై పెద్ద చర్యలు తీసుకుంది. కొత్త తాత్కాలిక అటాచ్‌మెంట్ ఆర్డర్ కింద దాదాపు 1400 కోట్ల రూపాయల విలువైన స్థిర ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. దీనితో పాటు, ED ఇప్పటి వరకు ADAG గ్రూప్‌కు చెందిన మొత్తం 9000 కోట్ల రూపాయల ఆస్తులను అటాచ్ చేసింది. స్వాధీనం చేసుకున్న ఈ ఆస్తులు నవీ ముంబై, చెన్నై, పూణే, భువనేశ్వర్‌లో ఉన్నాయి. ఈ చర్య మనీ లాండరింగ్‌కు సంబంధించిన దర్యాప్తులో భాగం. దర్యాప్తు కొనసాగుతోందని, అవసరమైతే మరిన్ని ఆస్తులను అటాచ్ చేయవచ్చని ED తెలిపింది.ED గతంలో కూడా ఇదే దర్యాప్తులో భాగంగా 7500 కోట్ల రూపాయల ఆస్తులను అటాచ్ చేసింది, ఇది అంబానీ గ్రూప్ కంపెనీలకు సంబంధించిన ఆర్థిక అవకతవకలపై ఆధారపడి ఉంది. దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. ED ఆస్తుల స్వభావం, దర్యాప్తు పరిధిలోకి వచ్చే లావాదేవీలతో వాటి

...మిగతాది 2 లో

# రైతు గోస పట్టించుకోని ప్రభుత్వం



- నష్టపోయిన రైతులకు మీరు ప్రకటించిన 10 వేలు వెంటనే ఇవ్వాలి
- ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్

**జయభేరి, జమ్మికుంట, నవంబర్ 20 :**

పంటలు చేతికి వచ్చాయి కానీ కాంటాలు లేవు, మిల్లుల్లో రోజుల తరబడి ధాన్యం దింపుకోకుండా ఇబ్బంది పెడుతున్నారు. క్వింటాల్ కి 8 కేజీల తరుగు తీస్తున్నారు. ఆరుగాలం కష్టపడితే ఈ దోపిడీ ఎందీ అని రైతులు అడుగుతున్నారు. మీరు సన్న వడ్లకు ఐదువందల రూపాయల బోనస్ ఇస్తా అన్నారు.. ఇంకా అందరికీ అందలేదు

...మిగతాది 2 లో



# శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న భారత రాష్ట్రపతి

**జయభేరి, తిరుచానూరు, నవంబర్ 20:**

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల తిరుపతి తిరుమల పర్యటన సందర్భంగా గురువారం శ్రీ పద్మావతి అమ్మవారి దర్శనం నిమిత్తం సాయంత్రం 4 గంటల 20 నిమిషాలకు తిరుచానూరు ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తిరుమల

...మిగతాది 2 లో

# స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ తప్పదా



**జయభేరి, విశాఖపట్టణం నవంబర్ 20:**

ఆంధ్రప్రదేశ్ లో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం మరోసారి తెరపైకి వస్తోంది. ఎన్ని వేల కోట్లు తెచ్చి పోసినా లాభాలు రాకుండా తెల్లఏనుగులా మారితే ఎంత కాలం అని భరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా వ్యాఖ్యానించడం చర్చనీయాంశమవుతోంది. సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ముగింపు సమయంలో మీడియాతో మాట్లాడిన చంద్రబాబు, ప్లాంట్‌ను 'వైట్ ఎలిఫెంట్' అని, ఉద్యోగులు 'ఇంట్లో కూర్చొని జీతాలు తీసుకుంటున్నారు' అని విమర్శించారు. "ప్రభుత్వం ఎప్పటికీ డబ్బు ఇస్తుందా? ఉద్యోగులు కష్టపడి పని చేసి లాభాలు తెచ్చి, ప్రైవేటీకరణకు అడ్డుకట్ట వేయాలి" అని అన్నారు. ఈ మాటలు ప్రైవేటీకరణకు ముందస్తు సంకేతమా అనే చర్చకు కారణమయ్యాయి.వైజాగ్ స్టీల్ ప్లాంట్ గత కొన్ని సంవత్సరాలుగా నష్టాల్లో మునిగిపోయింది. 2024లో రూ.4,000 కోట్లు నష్టం వచ్చింది. కేంద్రం ఫిబ్రవరి 2025లో రూ.11,440

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## చిక్కుల్లో కేటీఆర్

రూపంలో ఉందని ఏసీబీఅభిప్రాయపడింది. ₹600 కోట్లకు అవినీతి జరిగి ఉండొచ్చని అంచనా. హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎమ్‌డీఏ) అధికారులపై కడా అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఏసీబీ ఎఫ్ఐఆర్‌లో కేటీఆర్‌ను ప్రధాన నిందితుడుగా చూపించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ కుమారుడిగా, IT, పరిశ్రమల మంత్రిగా ఉండగా కాంట్రాక్టులు ఆమోదంలో కీలక పాత్ర పోషించారని అభియోగం. ఈ కేసులో సీనియర్ IAS అధికారి అర్వింద్ కుమార్ (A2), హెచ్ఎమ్‌డీఏ చీఫ్ సర్ఫరాజ్ అహ్మద్ (A3) కూడా నిందితుల జాబితాలో ఉన్నారు. కాంట్రాక్టులు అక్రమంగా ఇవ్వడం, అధికార దుర్వినియోగం, రాష్ట్రానికి నష్టం కలిగించడం వంటి ఆరోపణలతో 2024 డిసెంబర్ 18న ఏసీబీ కేసును నమోదు చేసింది. ఏసీబీ దర్యాప్తు 2024 చివరి నుంచి జరుగుతోంది. కేటీఆర్‌ను నాలుగుసార్లు (ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మేలో) విచారించారు. ప్రతి సారి 8, 10 గంటల పాటు విచారణ సాగింది. దర్యాప్తులో ఎలక్టోరల్ బాండ్ల ట్రాన్సాక్షన్లు, కాంట్రాక్టు డాక్యుమెంట్లు, ఫైనాన్షియల్ రికార్డులు పరిశీలించారు. కేటీఆర్ ఇదంతా రాజకీయ కుట్ర అని ఇదో లొట్టపీసు కేసు అని కొట్టిపారేస్తూ వచ్చారు. దమ్ముంటే అరెస్టు చేయాలనికూడా ప్రభుత్వానికి సవాల్ చేశారు.

కేసు విచారణలో భాగంగా 2025 సెప్టెంబర్ 9న ఏసీబీ తన ఫైనల్ రిపోర్ట్‌ను ప్రభుత్వానికి సమర్పించింది. దీనిలో కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్ చేయడానికి గవర్నర్ అనుమతి కోరింది. 2025 సెప్టెంబర్‌లో ఏసీబీ గవర్నర్‌కు అనుమతి కోరిన తర్వాత, ఇన్ని రోజులకు ఆయన ఆమోదం తెలిపారు. పీసీ యాక్ట్ ప్రకారం ప్రకారం గవర్నర్ అనుమతి లేకుండా మాజీ మంత్రులపై అవినీతి కేసులు నమోదు చేయడానికి వీలు లేదు. ఈ కేసుపై త్వరలో కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తారు. విచారణ ప్రారంభమవుతుందని ఏసీబీ వర్గాలు చెబుతున్నాయి. తర్వాత ఆయన్ని మరింత లోతుగా విచారించేందుకు అవకాశం లభించనుంది. వీలైతే అరెస్టు కూడా చేసే అధికారం దర్యాప్తు బృందానికి ఉంటుంది. ఈకేసులోనే ఏసీబీ వెలుగులోకి తీసుకొచ్చిన వివరాలతో ఈడీ కూడా ఎంట్రీ ఇచ్చింది. ఇప్పుడు ఆ కేసు దర్యాప్తులో ఏం జరగొచ్చనే ఉత్కంఠ కూడా నెలకొంది.

ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విచారించేందుకు ఏసీబీకి రాష్ట్ర గవర్నర్ అనుమతి ఇవ్వడంపై ఆయన సోదరి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై ఆమె తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఇతరులపై కేసులు పెట్టడం తప్ప బీజేపీకి మరో పని లేదని ఆమె ఎద్దేవా చేశారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ వైఫల్యం కారణంగా బస్తీల్లో ప్రజల ముఖం చూసే ధైర్యం కూడా కాంగ్రెస్ నేతలకు లేదని విమర్శించారు. అందుకే ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రతిపక్ష నేతలపై కుట్రపూరితంగా కేసులు పెడుతున్నారని ఆమె మండిపడ్డారు. దేశంలో ప్రస్తుతం కుట్రపూరిత రాజకీయాలు నడుస్తున్నాయని, అందుకు తెలంగాణలోనే అనేక ఉదాహరణలు ఉన్నాయని కవిత అన్నారు. అయితే ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, దేశంలో చట్టం, న్యాయం ఉన్నాయని గుర్తుచేశారు. ఈ రాజకీయ కుట్రలను ప్రజలు తిప్పికొడతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. తాము నంబర్ వన్ అయితే, మిగతా వాళ్లంతా 2, 3, 4 స్థానాల్లోనే ఉంటారని ఆమె వ్యాఖ్యానించారు.

ఫార్ములా ఈకారు రేసింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ ప్రాసిక్యూషన్‌కు తెలంగాణ గవర్నర్ అనుమతిచ్చిన నేపథ్యంలో, ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీ ఏమి చెబుతుందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించడాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, ఇప్పుడు ముఖ్యమంత్రి ఏమి చేస్తారో చూడాలని అన్నారు.బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని నిత్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శిస్తుంటారని ఆయన గుర్తు చేశారు. ఇన్నాళ్లూ గవర్నర్ అనుమతి ఇవ్వవద్దనే ముఖ్యమంత్రి కోరుకున్నారని వ్యాఖ్యానించారు. అవినీతిపరుల ఆస్తులను జప్తు చేస్తామని రేవంత్ రెడ్డి గతంలో అన్నారని, ఇప్పుడు గవర్నర్ అనుమతి ఇచ్చినందున ఆ దిశగా ఏమైనా చర్యలు తీసుకుంటారా అని ఆయన ప్రశ్నించారు.మావోయిస్టుల అంశంపై కూడా బండి సంజయ్ స్పందించారు. అర్బన్ నక్సలైట్లు చిన్నపిల్లలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. కార్లలో తిరుగుతూ సొంత పైరవీలు చేసుకుంటూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని అమాయక యువత అర్థం చేసుకోవాలని సూచించారు

## 10వ సారి సీఎంగా ప్రమాణం

గురువారం పశ్చిమ చంపారన్ జిల్లాలోని చారిత్రక భితిహర్వా ఆశ్రమంలో ఆయన ఈ మౌన వ్రతాన్ని పాటించారు.సుమారు వందేళ్ల క్రితం మహాత్మా గాంధీ ఈ ఆశ్రమాన్ని స్థాపించారు. గాంధీ సిద్ధాంతాలను ఎంతగానో ఆరాధించే ప్రశాంత్ కిశోర్, తన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ భారతి వంటి సహచరులతో కలిసి ఇక్కడికి చేరుకున్నారు. దీక్ష ప్రారంభించడానికి ముందు ఆశ్రమంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.మూడేళ్ల క్రితం తన 3,500 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రను ప్రశాంత్ కిశోర్ ఇదే ప్రాంతం నుంచి ప్రారంభించడం గమనార్హం. ఆ పాదయాత్ర ముగిశాక, గతేడాది గాంధీ జయంతి రోజున ఆయన జన్ సూరజ్ పార్టీని అధికారికంగా ప్రకటించారు. ఇప్పుడు ఎన్నికల్లో ఎదురైన పరాజయంతో అదే గాంధీ స్ఫూర్తి కేంద్రమైన ఆశ్రమంలో మౌన దీక్ష చేపట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## అంబానీ ఆస్తులు1400 కోట్లు సీజ్

సంబంధం గురించి మరిన్ని వివరాలను విడుదల చేస్తుందని భావిస్తున్నారు. ఆగస్టులో ఈ ఏజెన్సీ చివరిసారిగా అంబానీని ప్రశ్నించింది. ED దర్యాప్తు జైపూర్‌రింగాస్ హైవే ప్రాజెక్టుకు సంబంధించినది, దీని కోసం 2010లో రిలయన్స్ ఇన్‌ఫ్రాకు కాంట్రాక్ట్ లభించింది. ఈ ప్రాజెక్టు నుంచి ₹40 కోట్లు (సుమారు $1.2 బిలియన్లు) సూరత్‌లోని షెల్ కంపెనీల ద్వారా విదేశాలకు బదిలీ అయ్యాయని ఏజెన్సీ ఆరోపించింది. ఇది ₹600 కోట్లకు పైగా (సుమారు $1.2 బిలియన్లు) ఉన్న పెద్ద అంతర్జాతీయ హవాలా నెట్‌వర్క్‌లో భాగం కావచ్చు.ఇంతకుముందు, CBI అనిల్ అంబానీ, RCOM, ఇతరులపై మోసం, కుట్ర, అవినీతి ఆరోపిస్తూ FIR దాఖలు చేసింది. 2010, 2012 మధ్య భారతీయ, విదేశీ బ్యాంకుల నుంచి మొత్తం ₹40,000 కోట్లకుపైగా రుణాలు తీసుకున్నట్లు నివేదించింది. ఈ డబ్బు బదిలీ అయిన ఐదు ఖాతాలను బ్యాంకులు మోసపూరితమైనవిగా ప్రకటించాయి.

## స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ తప్పదా

కోట్ల ప్యాకేజీ ప్రకటించింది. ప్రైవేటీకరణ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసి ఆపేసింది. కేంద్రం రఇచ్చిన ప్యాకేజీతో ప్లాంట్ బతికిందని ఇక ప్రైవేటీకరణ లే లేనట్లేనన్నారు. కానీ ఆ తర్వాత కూడా స్టీల్ ప్లాంట్ పరిస్థితి మెరుగుపడలేదు. ఉద్యోగులు పని చేయడం లేదన్న నివేదికలు ఉండటంతోనే చంద్రబాబు ఇలా వ్యాఖ్యానించారని చెబుతున్నారు. ఆ అనుమానాలను నిజం చేస్తూ.. ఉత్పత్తి ఆధారితంగా జీతాలు చెల్లిస్తామన్న ఉత్తర్వులు స్టీల్ ప్లాంట్ యాజమాన్యం జారీ చేసింది. నవంబర్ జీతాలు ప్రొడక్షన్ టార్గెట్ లకు లింక్ చేశారు. ఇది ఉద్యోగుల్లో భయాన్ని మరింత పెంచింది. చంద్రబాబు ప్లాంట్‌ను ప్రొఫెషనల్‌గా నడపాలని కోరుతున్నారు. ఉద్యోగులు కష్టపడాలని చెప్పడం మేనేజ్‌మెంట్ సంస్కరణలకు సంకేతం అనుకోవచ్చు. కేంద్ర ప్యాకేజీతో ప్రైవేటీకరణ ఆగిపోయింది కానీ.. ఎలా ఎప్పటికీ గాడిన పడకుండా.. నష్టాలు వస్తూంటే..ఎప్పటికప్పుడు నిధులు తెచ్చి పూడుస్తారని అర్థం కాదని చంద్రబాబు నేరుగా చెబుతున్నారు. ప్రైవేటు కంపెనీలు పెద్ద ఎత్తున లాభాలు సంపాదిస్తూంటే అన్ని వనరులు ఉండి కూడా ఎందుకు స్టీల్ ప్లాంట్ కు లాభాలు రావడం లేదని చంద్రబాబు ప్రశ్నిస్తున్నారు. అయితే చంద్రబాబు మాటల్ని విపక్షాలు, యూనియన్లు దీన్ని 'ప్రైవేటీకరణకు మార్గం'గా చూస్తున్నాయి. ప్లాంట్‌కు క్యాప్టివ్ మైన్స్ లేకపోవడం వల్లే నష్టాలు వస్తున్నాయని వారంటున్నారు. వాలంటరీ రిటైర్మెంట్ స్కీమ్ ఉద్యోగులను తొలగించాలనే ప్లాన్ కూడా చేస్తున్నారని ఉద్యోగ సంఘాలు అనుమానిస్తున్నాయి. ప్లాంట్ లాభాల్లోకి వస్తే మాత్రమే ప్రైవేటీకరణ ఆగుతుందన్నట్లుగా చంద్రబాబు మాటలు ఉన్నాయి. అదే పనిగా నష్టాలు వస్తూంటే.. కేంద్రం కూడా నిధులు ఇవ్వదు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ లక్షన్నర కోట్లతో ప్లాంట్ పెట్టేందుకు ముందుకు వస్తోంది. ఆ కంపెనీ పూర్తి స్థాయి ప్రైవేటు కంపెనీ. ఆ కంపెనీ వస్తే విశాఖ స్టీల్ ప్లాంట్ కు మరిన్ని సమస్యలు వస్తాయని భావిస్తున్నారు. ఆ కంపెనీ కోసం స్టీల్ ప్లాంట్ ను నిర్వీర్యం చేస్తారన్న అనుమానాలు కొంత మందిలో వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి సమయంలో ఉద్యోగులు కష్టపడి పని చేసి లాభాల్లోకి తీసుకు వస్తే.. అప్పుడు ఏమీ చేయలేరని అంటున్నారు. ఇప్పుడు స్టీల్ ప్లాంట్ ను కాపాడుకోవాలంటే అది ఉద్యోగుల్లో చేతుల్లోనే ఉందంటున్నారు.

# పని చేయని ఓటు చోరీ

**స్వాతంత్ర్య సాధన ఉద్యమ పార్టీగా, స్వతంత్ర భారతదేశాన్ని అత్యంత ఎక్కువకాలం పాలించిన పార్టీగా కాంగ్రెస్‌కు పేరుంది. కానీ కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం రాజకీయంగా అత్యంత గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. అటు పార్లమెంట్ ఎన్నికల్లోనూ, ఇటు ఆయా రాష్ట్రాల్లోనూ సొంతంగా పోటీచేసినా, అవసరాన్ని బట్టి ఇతర పార్టీలతో కూటమిగా ఏర్పడి పోటీచేసినా పెద్దగా ప్రభావం చూపలేకపోతుంది.**



కొంతకాలంగా ఆయా ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి ఓడిపోవడంపై ఆ పార్టీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఆసక్తికరమైన ఆరోపణలు చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా కేంద్రంలోని బీజేపీ, కేంద్ర ఎన్నికల కుమ్మక్కు అయి ఓట్ చోరీకి పాల్పడుతుందని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖ్యంగా మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు చోరీ జరిగిందని పలు సమావేశాలు నిర్వహించి కూడా ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. బీహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ కూట మి ఘోరమైన పరాభవాన్ని మూటగట్టుకున్నది. కానీ బీహార్‌లో కూడా ఓట్ చోరీ జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తుంది. దీనికి ప్రధాన కారణం బీహార్ ఎన్నికల ముందు ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) పేరిట రాష్ట్రంలోని 65 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించింది. అయితే ఈ అంశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దఎత్తున పోరాటం చేశారు. కానీ ఫలితాల్లో ఇది ఎలాంటి ప్రభావమూ చూపలేదు.కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న సంస్థాగత లోపమే కారణమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ కేవలం ఆయా అంశాలకు సంబంధించిన ఆరోపణలకు మాత్రమే పరిమితమవుతుందని, వాటిని నిరూపించే ప్రయత్నం, వాస్తవాలను బహిర్గతం చేసే ప్రయత్నం గానీ చేయడం లేదని స్పష్టం చేస్తున్నారు. రాజకీయంగా సానుకూలంగా మార్చుకోగలిగే పరిణామాల ను కూడా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతుంది.ఇలాంటి పరిస్థితుల కారణంగా కాంగ్రెస్ పార్టీ రోజురోజుకూ దేశవ్యాప్తంగా రాజకీయ పట్టును కోల్పోతుందని హెచ్చరిస్తున్నారు. దీనికి బీహార్ ఎన్నికలే ప్రత్యక్ష నిదర్శనమని ఉదాహరిస్తున్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్టీ నాయకులతో ఇటీవల ఒక సమావేశాన్ని నిర్వహించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముసాయిదా ఓటరు జాబితాల నుంచి 65 లక్షల మందిని తొలగించడంతో అభ్యంతరం తెలుపుతూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో ఓటర్ల జాబితాలో ఏర్పడిన సందిగ్ధతపై సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని కొలిక్కి తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను తమకు అందించాలని ఈసీని సుప్రీంకోర్టు ఆదేశించింది.ఆ ఓటర్లను ఏ ప్రాతిపదికన తొలగించారో తాము కూడా తెలుసుకుంటామని స్పష్టంచేసింది. అదేవిధంగా తొలగించిన ఓటర్ల వివరాలతో కూడిన కాపీని ఏడీఆర్‌కు కూడా అందించాలని స్పష్టం చేసింది. బీహార్‌లో ఎస్ఐఆర్ కోసం ఈసీ జారీచేసిన ఆదేశాలను ఏడీఆర్ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీంతోపాటు తాజాగా తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల పేర్లు, వివరాలను బహిరంగంగా ప్రకటించేలా ఆదేశాలు ఇవ్వాలని మరో పిటిషన్ దాఖలు చేసింది. జాబితాల నుంచి తీసేసిన ఓటర్లు మృతిచెందారా?. శాశ్వతంగా వలసపోయారా?. అనే విషయాలను స్పష్టం చేయాలని కోరింది. ఆ సంస్థ ఫిర్యాదుపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం తొలగించిన ఓటర్ల వివరాలు, తొలగి ంపునకు గల కారణాలను వెల్లడించింది. బీహార్ ఓటర్ల జాబితా నుంచి కేంద్ర ఎన్నికల సంఘం 65 లక్షల మందిని తొలగించింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా సంబంధిత ఫారాలను సమర్పిం చడా నికి గడువుకు ఒక రోజు ముందే వారందరినీ ఓటర్ల జాబి తా నుంచి తొలగించనున్నట్టు తెలిపింది. లిస్టు నుంచి తీసేసే ఓటర్లలో 21.6 లక్షల మంది మరణించారని, 31.5 లక్షల మంది శాశ్వతంగా బీహార్ వదిలి వెళ్లారని, 7 లక్షల మంది రెండు ప్రదేశాలలో ఓటర్లుగా నమో దు చేసుకున్నారని, లక్ష మంది ఆచూకీ తెలియడం లేదని ఈసీ పేర్కొంది.

భారీగా ఓటర్లను తొలగిస్తే బీహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాల్లో సగటున ఒక్కో నియోజకవర్గానికి 25 వేలకు పైగా పేర్లు డిలీట్ అయ్యాయి. అయితే ఈ పరిణామం బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభా వాన్ని చూపిందని విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో అనేక స్థానాల్లో పలువురు అభ్యర్థులు స్వల్ప తేడాతో విజయం సాధించారని గణాంకాలు చెబుతున్నాయి. దీంతోపాటు ప్రస్తుతం ఎన్నికల సంఘం ఆయా నియోజకవర్గాల్లో తొలగించిన ఓట్ల కంటే తక్కువ తేడాతో కూడా ఓడిపోయారు.అయితే ఈసీ నిర్ణయాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్, ఆర్జేడీలు వ్యతిరేకించాయి. దీనిని తొందర పాటు చర్యగా అభివర్ణిస్తూ నిరసనలు కూడా తెలుపుతున్నాయి. అయితే ఓటర్ జాబితా నుంచి 65 లక్షల మందిని తొలగించిన కాంగ్రెస్ పార్టీ కేవలం ఆరోపణలకు, నిరసనలకు మాత్రమే పరిమితమైంది. జాబితా సరి చేయడంలో తమ వంతు బాధ్యతను విస్మరించింది. ఫలితంగా ఎన్నికల ఫలితాల్లో ఘోరంగా భంగపాటుకు గురైందివాస్తవానికి ఎస్ఐఆర్ పేరుతో ఓటర్లను తొలగించినప్పటికీ అభ్యంతరం ఉన్న వారు సరైన పత్రాలు చూపించి తిరిగి నమో దు చేసుకోవచ్చు. జాబితాలో తిరిగి నమోదు చేయించుకునేందుకు నెల రోజుల గడువు ఇచ్చినా దీనిని కాంగ్రెస్ వినియోగించుకోలేదని వాదనలు వినిపిస్తున్నాయి. బీహార్‌లో కాంగ్రెస్ కూటమి ఓడిపోవడానికి స్వయం కృతమే కారణమని స్పష్టంగా తెలుస్తుంది. మొదటి నుంచి ఆ పార్టీ ఈవీఎం, ఓట్ల చోరీ అంశాలను మాత్రమే ప్రధానంగా ఎత్తి చూపుతున్నది. బీహార్‌లో కాంగ్రెస్ కూటమి ఓటమికి వారు చేసిన రాజకీయాలే కారణం. నితీష్‌కుమార్‌పై ఉన్న అధికార వ్యతిరేకతను ఓట్లుగా మలచుకుని యువతకు అద్భుతమైన భవిష్యత్ ఇస్తామని నమ్మ కం కల్పించాల్సింది పోయి, ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదన్నట్లుగా వ్యాఖ్యలు చేశారు.

ఎన్నికలకు ముందు ఓటర్ అధికార యాత్ర చేశారు. ప్రజా సమస్యలను కా కుండా, ఎన్నికల వ్యవస్థపై అనుమానం వ్యక్తం చేసేలా ప్రచారం చేశారు. ఓట్ చోరీ అంశంపై దృష్టి సారించడమే బీహార్‌లో కాంగ్రెస్ ఓటమికి ప్రధాన కారణమైంది. బీహార్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ తమ సత్తా చాటుకున్నది. ఓట్ల తొలగింపు అంశాన్ని సమర్థవంతంగా వినియోగించుకున్నది. అవకాశాన్ని అందిపుచ్చుకొని 2020 ఎన్నికల్లో తరహాలోనే ఐదు స్థానాలను కైవసం చేసుకున్నది. కాంగ్రెస్ కూటమి ఘోరంగా విఫలమైనప్పటికీ ఎంఐఎం పార్టీ తన పట్టు నిలుపుకుంది. ముఖ్యంగా ముస్లిం జనాభా అధికంగా ఉండే సీమాంచల్ ప్రాంతంలోని ఐదు స్థానాల్లో గెలుపొందింది.జోకిహత్ (అరారియా), కోచాధామన్ (కిషన్‌గంజ్), అమౌర్ (పూర్ణియా), బైసి (పూర్ణియా), బహదూర్ గంజ్ స్థానాల్లో ఎంఐఎం అభ్యర్థులు గెలుపొందారు. వీటిలో నాలుగు స్థానాలను 2020 ఎన్నికల్లో కూడా ఆ పార్టీ గెలుచుకోవడం గమనార్హం. ఇండియా కూటమిలో చోటు దక్కకపోవడంతో, రాష్ట్రంలో తమ ఉనికిని చాటుకోవాలని ఎంఐఎం గట్టిగా ప్రయత్నించింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో భారీఎత్తున ఓట్లు తొలగించటం 'ఓట్ల దొంగతనం' కిందకే వస్తుందని వ్యాఖ్యానిస్తూ కాంగ్రెస్ పార్టీలోని లోపాలను కూడా ఎత్తి చూపారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 19 సీట్లు గెలిచిన కాంగ్రెస్ ఈసారి కేవలం 6 సీట్లు మాత్రమే దక్కించుకోవడంపై స్పందించారు.కాంగ్రెస్ ఘోర పరాభవాన్ని చవిచూసిన నేపథ్యంలో పార్టీ తన సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఓట్ల తొలగింపుపై చేసిన కాంగ్రెస్ కూటమి చేసిన ఆరోపణలపై గదుల్లో కూర్చొని మీటింగ్‌లే కాకుండా రోడ్డెక్కి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పనిలో బీఎల్‌వోలతో కలిసి పనిచేయాలని సూచించారు. సంస్థాగత బలోపేతంపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక శ్రద్ధ చూపించాలి

## రైతు గోస పట్టించుకోని ప్రభుత్వం

ఈసారి అయినా ప్రతి రైతుకు అందించాలని కోరుతున్నాను. రెండు లక్షల రుణమాఫీ కూడా ఇంకా పెండింగ్ లో ఉంది. వర్షాలు పడి వరి మునిగింది, తుఫాను మట్టి పాలు చేసింది.. నష్టపోయిన రైతులకు మీరు ప్రకటించిన 10 వేలు వెంటనే ఇవ్వాలానీ డిమాండ్ చేసారు. పత్తి విషయంలో కూడా నాన్చకుండా కొనుగోళ్లు చేయాలి. 7 క్వింటాల్ నిబంధన లేకుండా కొనుగోళ్లు చేయాలని కోరుతున్నాం. సీసీఐ కూడా వర్షం వల్ల నష్టపోయి ఉన్నారు కాబట్టి నిబంధనలు సడలించాలి. ఫసల్ భీమా రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో చెల్లిస్తే రైతులకు ఇబ్బంది ఉండేది కాదన్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లో అత్యధిక వార్డు మెంబర్స్, సర్పంచులను, ఎంపీటీసీ, ఎంపీపీ, జీపీటీసీలను గెలిపించుకుంటాం. వీరంతా ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉంటారు. వారికి ఉన్నంత అవగాహన మాకు కూడా ఉండదు. ఎమ్మెల్యేగా గెలవాలి అంటే వీరి పాత్ర కీలకం. ఈ సారి స్థానిక సంస్థల ఎన్నికలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంది. రెండు మున్సిపాలిటీలలో కూడా బూత్ పటిష్టం చేసుకొని గెలిపించుకుంటాం. 107 గ్రామ పంచాయితీలలో మెజారిటీ గెలిచే సత్తా మాకే ఉంది. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఎలా కష్టపడ్డానో ఇప్పుడు కూడా అంతే కష్టపడి గెలిపించుకుంటాం. త్వరలోనే నాయకులు కార్యకర్తలందరితో స్ట్రాటజీ మీటింగ్ పెట్టుకుంటాం. సర్పంచ్ లను గెలిపించుకొనే భాధ్యత నాది. నేను ఇక్కడికి వచ్చాక గత 20 ఏళ్లలో జెడ్పీటీసీ, ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్ ఓడిపోయింది లేదు. 80 శాతం సర్పచులు మావే. ప్రతి ఎన్నికలో భారీ మెజారిటీతో గెలిపించుకున్నామన్నారు.. హుజూరాబాద్ ప్రజలకు నా విజ్ఞప్తి మా వాళ్ళని గెలిపించి ఇవ్వండి. పనులు చేయించే జిమ్మేదార్ నాది అని హామీ ఇస్తున్న. నేను ఎమ్మెల్యేగా గెలిచిన ఒక సవత్సరం తరువాత ఏడాదిగా ఏం చేశారు అని ధర్నా చేశారు.. మరి ఇప్పుడు గెలిచి రెండేళ్లు అవుతుంది ఏం చేశారు.. మీ ముఖం ఎక్కడ పెట్టుకుంటారు అని అడుగుతున్న. ప్రజలు చీకట్లో ఉండి పోయినం బిడ్డ అని ఏడుస్తున్నారు. అయిపోయింది ఏదో అయిపోయింది అప్పుడప్పుడు రా బిడ్డ అని అడుగుతున్నారు. నువ్వు రాకపోతే వెలుగు లేదని ప్రజలంటున్నారు. నేను మీడియాను, సోషల్ మీడియాను నమ్ముకున్న వాణ్ణి కాదు. ప్రజలను, ధర్మాన్ని, పనిని నమ్ముకున్న వాణ్ణి. 25 ఏళ్లు ఇలానే బ్రతికిన. ఉన్నదాన్నే చెప్పుకునే తెలివి లేని వాళ్ళం. నన్ను 25 ఏళ్లు గుండెల్లో పెట్టుకున్న గడ్డ హుజూరాబాద్. ఈ ప్రజలను ఎలా మర్చిపోతా. తట్టెడు మట్టి తీయలేదు అన్నారు కదా.. మీరు వంద స్పీడ్ తిరుగుతున్న 4 లైన్ల రోడ్లు ఎవరు వేశారు? కంటిరెప్పపాటు కరెంటు పోకుండా ఉండే సబ్ స్టేషన్లు ఎవరు కట్టించారు, ఎప్పడు జలకళ ఉండేలా చెక్ డామ్ లు నిర్మించింది ఎవరు, కమలాపూర్లో ఎడ్యుకేషన హబ్ తయారు చేసింది ఎవరు.. ఇవన్నీ మా ప్రజలకు తెలుసు. దొంగముఖాలకు అర్థం కావు.. అబద్ధాలు నమ్ముకొని బ్రతికే వారు.. వారికి ప్రజలే బుద్ధి చెప్తారు.


## శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న భారత రాష్ట్రపతి

తిరుపతి దేవస్థానం ఈవో అనిల్ కుమార్ సింగల్, అనంతపురం రేంజ్ డిఐజి షిమోషీ, జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్, సి వి ఎస్ ఓ కె.వి.మురళీకృష్ణ, జిల్లా ఎస్పి ఎల్.సుబ్బరాయుడు, టి టి డి బోర్డు మెంబర్ భాను ప్రకాష్, టిటిడి జెఈఓ వి.వీరబ్రహ్మం, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, అడిషనల్ ఎస్ పి రవి మనోహరాచారి, తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్ తదితరులు భారత రాష్ట్రపతి కి స్వాగతం పలికి పలికారు. ఆలయం వద్ద భారత రాష్ట్రపతికి కి ఆలయం వద్ద వేద పండితులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. శ్రీ పద్మావతి అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు ఆలయ మర్యాదలతో రాష్ట్రపతికి వేద ఆశీర్వచనాలు పలికి, తీర్థ ప్రసాదాలు అందించారు దర్శనానంతరం రాష్ట్రపతి సాయంత్రం 5.25 గం.లకు తిరుమల బయల్దేరి వెళ్లారు.

## దశావతారాల నుండి మనం ఏం నేర్చుకోవాలో తెలుసా!?



జయభేరి ఆధ్యాత్మిక శీర్షిక



✍ Dr. హరి హర నాద రాజు
శంబాలా 360 సోలుషన్స్
9177 445 591
www.shambala360solutions.com

**1. మత్స్యావతారం - చేప**

నీటిలో ప్రతికూల పరిస్థితుల్లోనూ ఏ విధంగా ఈదుతుందో, అదేవిధంగా జీవితంలో 'ప్రతికూల పరిస్థితుల్లో'నూ సంసారాన్ని ఈదాలి.

**2. కూర్మావతారం - తాబేలు**

అవసరం లేనప్పుడు ఏ విధంగా ఇంద్రియాలను వెనక్కి తీసుకుంటుందో, అదేవిధంగా మనం పనులు లేనప్పుడు ఇంద్రియాలను కట్టివేసి 'ధ్యానం' చేయాలి.

**3. వరాహావతారం - వరాహం**

ప్రపంచ భారాన్ని ఏ విధంగా మోస్తుందో, అలాగే 'ఇంటి బాధ్యత'లను మొయ్యాలి.

**4. నరసింహావతారం**

మనలోని అజ్ఞానాన్ని చీల్చి చెందడాలి.

**5. వామనావతారం**

మొదటి అడుగు భౌతికంగానూ, రెండవ అడుగు ఆధ్యాత్మికంగాను జీవిస్తూ; మరి మూడవ అడుగును మనలోని 'అహంకారాన్ని' గుర్తించి 'బలి' ఇవ్వాలి

**6. పరశురామావతారం**

'లక్ష్యం' కోసం పట్టుదలతో ముందుకెళ్లాలి.

**7. రామావతారం**

ధర్మ'యుతంగా జీవించాలి

**8. కృష్ణావతారం -**

ఎన్ని కష్టాలు ఎదురైనా 'ఆనందం'గా ఉండాలి.

**9 . బుద్ధావతారం** : 'జ్ఞానాన్ని' పంచాలి.

**10. కల్కి అవతారం**

సకల మానవాళి 'అజ్ఞానాన్ని విజ్ఞానాన్ని తీసివేయాలి జ్ఞానం సంపాదించుకుని శంభాల మాత అనుగ్రహంతో దేవుడిగా మారి మోక్షం పొందాలి. దైవ శక్తి దేశభక్తి సనాతన సంస్కృతి

# కొండపైన సౌకర్యాలు మెరుగుపర్చండి

- యాదగిరిగుట్ట భక్తుల ఇబ్బందులు తీర్చకుంటే పోరాటమే : సిపిఐ నేతలు

**జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 20:**



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో ఎన్నో సమస్యలు తిష్టవేశాయని,వెంటనే సమస్యలను పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. గురువారం 140 సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని యాదగిరిగుట్ట ఆలయ ఈవో వెంకట్ రావుకు సీపీఐ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల అనాలోచిత తీరుతో కనీస మౌలిక సదుపాయాలు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని,కొండపైన భక్తులకు సరిపడా తాగునీరు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామివారి పూజా కైంకర్యాల వివరాలు ఆలయ మాడావీధులతో పాటు పలు చోట్ల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అన్నదాన సత్రం పూర్తయి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ప్రారంభించలేదని, ప్రస్తుతమున్న అన్నదాన భవనం భక్తులకు సరిపోవడం లేదన్నారు.యాదగిరిగుట్ట దేవాలయం ఆధ్వర్యంలో భక్తుల కోసం అంబులెన్స్ ఏర్పాటు చేయాలని, అర్చకులకు ప్రత్యేక వసతులతో కూడిన గదిని ఏర్పాటు చేయాలన్నారు. సత్యనారాయణ వ్రత మండపాన్ని అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్ లో ఏర్పాటు చేసి అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్ ను వ్రత మండపానికి మార్చాలన్నారు. కొండపైన పనిచేస్తున్న ఎస్పీఎఫ్ సిబ్బందిని కొండ కింద కూడా నియమించాలని సూచించారు. భక్తుల కోసం కొండపైన 100 టాయిలెట్లు,మెట్ల మార్గం వద్ద టాయిలెట్లు,డార్మెంటరీ హాల్ నిర్మించాలన్నారు. యోగానంద నిలయం స్థలంలో వెంటనే కొత్త భవనం నిర్మించి, భక్తులకు వసతి కల్పించాలన్నారు. గత కొన్ని నెలలుగా కలెక్టర్ ఇంట్లో పనిచేస్తున్న వంట పూజారిని తక్షణమే ఆలయంలో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు వెంటనే పరిష్కారమయ్యే విధంగా చూడాలని,లేదంటే సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి జంగమ్మ,పేరబోయిన మహేందర్,మున్సిపల్ శాఖ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్,సిపిఐ నేతలు పేరబోయిన బంగారి,గోపగాని రాజు,గుండు వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## నిర్మాణాలకు నిధులు మంజూరు

**జయభేరి, హస్తినాపురం :**

హస్తినాపురం డివిజన్ అభివృద్ధికి జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సమావేశంలో నిధులు మంజూరు చేసినట్లు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు గురువారం జిహెచ్ఎంసి కార్యాలయంలో నిర్వహించిన తొమ్మిదవ స్టాండింగ్ కమిటీ సమావేశంలో అనుపమ నగర్ సరస్వతి నగర్ హస్తిన పురం నార్త్ extension నూతనంగా సిసి రోడ్ల నిర్మాణానికి కోటి 84 లక్షలు ఇతర కాలనీలో కాంపౌండ్ ఇతర నిర్మాణాలకు నిధులు సుమారు కోటి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం హైదరాబాద్ నగరం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు గత ప్రభుత్వంలో నిధులు మంజూరు కాలేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటునుండి హస్తినా పురం డివిజన్ కు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు ఏ సమస్య ఉన్న తన దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు

## స్పోర్ట్స్ మీట్లో ఘన విజయం




**జయభేరి, మేడిపల్లి :**

అంబర్పేటలో ఎంసీహెచ్ మైదానంలో జరిగిన క్రీడోత్సవాలల్లో బోడుప్పల్ నారాయణ పాఠశాల ఘన విజయం సాధించింది. ఈ పోటీలల్లో నారాయణ గ్రూప్కు చెందిన వివిధ బ్రాంచీల విద్యార్థులు పాల్గొన్నారు. బోడుప్పల్ నారాయణ స్కూల్ విద్యార్థులు ఏడు ట్రోఫీలను తొలి ప్రయత్నంలో కైవసం చేసుకోవడం విశేషం. వివిధ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంబర్పేట సీఐ కిరణ్కుమార్, జీఎం గోపాల్రెడ్డి, ఎన్జీ జోన్ ఏజీఎం బాల పరమేశ్వర్ హాజరయ్యారు. పోటీల్లో గెలిచిన విద్యార్థులకు, పీఈటీ, ఉపాధ్యాయ బృందాన్ని స్కూల్ ప్రిన్సిపల్ సత్యవాణి అభినందించారు.

## శ్రీ చైతన్య హైస్కూల్ లో క్విజ్ పోటీలు




**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్ డిపో సమీపంలో గల శ్రీ చైతన్య హై స్కూల్ తో పాటు బోడుప్పల్ బ్రాంచ్ లో 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు సామ అశోక్ రెడ్డి,వైస్ ప్రిన్సిపాల్ సామ శోభారాణి, డైరెక్టర్ సామ సాయి అభిషేక్ రెడ్డిల ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్స్ వైద్య నిపుణుడు డాక్టర్ ప్రశాంత్ బాబు, జనరల్ మేనేజర్ శ్రీనివాస్ సహకారంతో పోటీలు నిర్వహించారు.పోటీల్లో హెల్త్, రామాయణం, రాష్ట్రాలురాజధానులు, యూనియన్ టెరిటరీస్, కరెంట్ అఫైర్స్ వంటి అంశాలపై ప్రశ్నలు సిద్ధం చేసి, విద్యార్థుల్లో సాధారణ జ్ఞానాన్ని పెంపొందించేలా కార్యక్రమం కొనసాగింది.




విజేతలుగా నిలిచిన విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించి, వారికి బహుమతులు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి తోడ్పడిన యశోదా హాస్పిటల్స్ బృందానికి పాఠశాల అధ్యాపక వర్గానికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్ల దుస్థితి గురించి మంత్రిని కలిసిన జేఏసీ నాయకులు



**జయభేరి, సిద్దిపేట :**

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన రోడ్ల దుస్థితి గురించి హైదరాబాద్ సచివాలయంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అందె గ్రామానికి సంబంధించిన రోడ్ల దుస్థితి గురించి సిద్దిపేట జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ ని కలసి ఉండే గ్రామ రోడ్ల పరిస్థితిల గురించి తెలియజేయడం జరిగింది. మారుమూల గ్రామమైన అందే నుండి మిరుదొడ్డి వరకు పంచాయతీరాజ్ రోడ్డు, అందే నుండి తిమ్మాపురం వరకు ఆర్ అండ్ బి రోడ్డు, గత 25 సంవత్సరాల క్రితం వేసిన రోడ్లు, పూర్తిగా కంకర తేలి గుంతల మాయమయ్యాయి. ఈ రోడ్డు పైన వెళ్లే, విద్యార్థులు రైతులు ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతూ నిత్యం నరకం అనుభవిస్తున్నారని, అనేక రోడ్డు ప్రమాదాల గురవుతున్నామని తెలియజేశారు. ఈ గ్రామానికి సంబంధించిన రోడ్లను, HAM ప్రాజెక్టులో ఫేస్ వన్ చేర్చాలని, అందే గ్రామానికి రోడ్లు వేసి ప్రజలకు న్యాయం చేయాలని కోరుతూ తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో అందే జేఏసీ కన్వీనర్ వారాల రాజకుమార్, అందె ప్రవీణ్, సోమేశ్వర్ రెడ్డి రాజు పరశురాములు శంకర్ నరసింహులు సంతోష్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేస్తే క్రిమినల్ కేసులు

- సజ్జనార్

**జయభేరి, హైదరాబాద్:**

పోలీస్ అధికారులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ సిబ్బందితో సహా ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఉద్యోగులను బెదిరించినా, దాడులు చేసినా చట్ట ప్రకారం బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేసి, హిస్టరీ షీట్స్ కూడా తెరుస్తామని వార్నింగ్ ఇచ్చారు. క్షణికావేశంలో ఏ చిన్న తప్పు చేసినా జీవితాంతం కుమిలి పోవాల్సి వస్తుందని ప్రకటన జారీ చేశారు. ''పోలీస్ అధికారులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ సిబ్బందితో సహా ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన, బెదిరింపులకు దిగిన, దాడులు చేసిన చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడులు చేస్తే భారత న్యాయ సంహిత(బీఎన్ఎస్)లోని 221, 132, 121(1) సెక్షన్స్ ప్రకారం బాధ్యులపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తాం. హిస్టరీ షీట్స్ కూడా తెరుస్తాం. గుర్తుంచుకోండి.. ఒక్కసారి కేసు నమోదైతే భవిష్యత్ అంధకారమయ్యే ప్రమాదం ఉంటుంది. పాస్ పోర్టు జారీకి, ప్రభుత్వ ఉద్యోగానికి ఇబ్బందులు వస్తాయి. క్షణికావేశంలో ఏ చిన్నతప్పు చేసిన జీవితాంతం కుమిలిపోయేలా చేస్తాయి'' అని పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళ



**జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 20:**

యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూర్ రైల్వే గేట్ సమీపంలోని హైవేపై రోడ్డు ప్రమాదం జరిగింది. గురువారం యాదగిరిగుట్ట పట్టణ సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం వంగవల్లి ఉప్పలమ్మ అనే మహిళ రోడ్డు దాటుతుండగా కారు నెంబర్ టీఎస్ 03 ఈఎస్ 5508 ఢీకొట్టింది. రోడ్డు ప్రమాదంలో మహిళ తల, కాళ్లకు తీవ్రగాయాలు కాగా నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. మృతురాలు మోటాకొండూరు గ్రామవాసిగా గుర్తించినట్లు, మృతురాలు ఉప్పలమ్మ మరిది చాట్ల రాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు యాదగిరిగుట్ట పట్టణ సీఐ బాస్కర్ తెలిపారు.

# స్టేడియం ల్యాండ్ లో డిజిటల్ సర్వే

- గత 30 సంవత్సరాలుగా స్మశాన వాటిక స్థలం కోసం, 22 సంవత్సరాలుగా స్టేడియం ల్యాండ్ పై కోర్టులో పోరాటం--తాడూరి గగన్ కుమార్

**జయభేరి, కాప్రా :**




కాప్రా మండల పరిధిలోని సర్వే నెంబర్ 199/1 జమ్మిగడ్డ ప్రాంతంలో స్టేడియం కోసం గత ప్రభుత్వం కేటాయించిన 12 ఎకరాల భూమి మరియు ఇందులో స్మశానవాటిక ఉన్న విషయం తెలిసిందే. స్టేడియం ల్యాండ్ భూమి గత 22 సంవత్సరాలుగా జిల్లా కోర్టులో 2003 సంవత్సరం నుండి కేసు కొనసాగినప్పటికీ ఒరిజినల్ సూట్ ఆగస్టు 2023 సంవత్సరంలో మరియు ఆపిల్ సూట్ మొన్న ఈ మధ్యకాలంలో 13 నవంబర్ 2025 ఇట్టి కేసు గౌరవ జిల్లా కోర్ట్ లో మరోసారి చిలకమ్మా అండ్ అదర్స్ పిటిషన్ డిస్మిస్ అయినది. ప్రభుత్వ భూమి రక్షణలో భాగంగా ఈ భూమిని కాపాడేందుకు గత దశాబ్దాల కాలంగా సాగిన నా పోరాటం ఫలించింది. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వ ఏర్పాటు చేసిన హైడ్రాలో ఫిర్యాదు మేరకు రెవెన్యూ మరియు మున్సిపల్ అధికార సిబ్బంది గత రెండు రోజుల క్రితం మండల సర్వే చేయగా, ఈ రోజు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి బౌండరీస్ డీమార్కేషన్ కోసం రెవెన్యూ అధికారులు DI సత్య మేడం, మండల సర్వేయర్ మహేందర్, RI సత్యనారాయణ, కాప్రా మున్సిపల్ అధికారులు టౌన్ ప్లానింగ్ విభాగం DyCP కృష్ణమోహన్ గారు ఇంజనీరింగ్ విభాగం DE బాలకృష్ణ,



AE అభిషేక్ గార్లు మరియు సిబ్బంది పాల్గొనగా ఇట్టి డిజిటల్ సర్వే ప్రశాంతంగా కొనసాగేందుకు హైడ్రా సిబ్బంది, కుషాయిగూడ, జవహర్ నగర్ పోలీస్ అధికార యంత్రాంగ భాగస్వామ్యంతో నిర్వహించారు తొందరలోనే డిజిటల్ సర్వే రిపోర్ట్ ఆధారంగా కాప్రా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా శాశ్వత కాంపౌండ్ వాల్ పనులు మొదలు కాబోతున్నాయి.... 30 సంవత్సరాలుగా కొనసాగిన సమస్యకు పరిష్కారం పై చేసిన పోరాటం ఫలించే దిశగా రావడంతో సంతోషం వ్యక్తం చేస్తూ సమస్య పరిష్కారానికి నాకు తోడుగా నిలిచిన ప్రింట్/ఎలక్ట్రానిక్ మీడియా దేవుళ్ళకు, కేసుకు సహకరించిన అడ్వకేట్లకు, రెవిన్యూ/మున్సిపల్ అధికారులకు, పోలీస్ అధికారులకు, కొంతమంది రాజకీయ పెద్దలకు, నాకు తోడుగా ఉన్న స్థానిక ప్రజలుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇట్టి విజయం జమ్మిగడ్డ ప్రజలకు అంకితం చేస్తూ... సదా మీ సేవలో జమ్మిగడ్డ స్మశాన వాటిక పరిరక్షణ కమిటీ కన్వీనర్, తాడూరి గగన్ కుమార్.

# పాతగుట్ట రోడ్డు బాధితులకు అండగా బీఆర్ఎస్ ఉద్యమం

- యాదగిరిగుట్ట మండల పార్టీ అధ్యక్షులు కర్రె వెంకటయ్య,
- బిఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి వెల్లడి

**జయభేరి, యాదగిరిగుట్ట :**



యాదగిరిగుట్ట పట్టణంలోని పాతగుట్ట రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం జరిగే వరకూ పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని బిఆర్ఎస్ యాదగిరిగుట్ట మండల పార్టీ అధ్యక్షులు కర్రె వెంకటయ్య, బిఆర్ఎస్ పార్టీ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి ప్రకటించారు. పాతగుట్ట రోడ్డు బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వారికి మద్దతుగా గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని పాతగుట్ట చౌరస్తా వద్ద బిఆర్ఎస్ పార్టీ పట్టణ ఆధ్వర్యంలో స్థానిక రోడ్డు బాధితులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వం యాదగిరిగుట్ట పునర్నిర్మాణం జరిగిన సమయంలో స్థలాలు,ఇండ్లు కోల్పోయిన వారికి తగిన నష్టపరిహారాన్ని అందించిన తర్వాతనే పునర్నిర్మాణ పనులను చేపట్టిన విషయాన్ని వారు గుర్తు చేశారు. అదే తరహాలో ప్రస్తుతం పాతగుట్ట రోడ్డు బాధితులకు కూడా తగిన నష్ట పరిహారం పూర్తిస్థాయిలో అందించాలని కోరారు. పాతగుట్ట రోడ్డు విస్తరణలో భాగంగా నష్ట పరిహారంతో పాటు ఇల్లు కోల్పోయిన వారికి ఇండ్లు, ప్లాట్లు కోల్పోయిన వారికి ప్లాట్లు అందించడంతో పాటు వైటిడిఏ పరిధిలోని వారికి దుకాణాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. రోడ్డు బాధితుల ఆవేదనను ఏమాత్రం పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందని... అధికారులు రోడ్డు బాధితుల వాదన వినకుండా ముందుకెళ్లడం సరి అయిందని కాదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు పాతగుట్ట రోడ్డు బాధితుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని... లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత పెద్ద ఎత్తున కొనసాగిస్తామని అన్నారు. ఈ సందర్భంగా సుమారు రెండు గంటలకు పైగా పాతగుట్ట చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ట్రాఫిక్ జాం ఏర్పడింది. దీంతో పోలీసులు అక్కడ చేరుకొని ఆందోళనకారులను సముదాయించారు. అనంతరం వారి చేత రాస్తారోకో విరమింపజేశారు. ఈ రాస్తారోకోలో పాతగుట్ట రోడ్డు విస్తరణ బాధితులు కోక్కల రవీందర్,కంసాని స్వామి,దేవేందర్,కంసాని శేఖర్,కంసాని కాళీ, బాలకృష్ణ,రవి నరసింహతో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు దేవపూజ అశోక్, ఆరే శ్రీధర్ గౌడ్, పేరబోయిన సత్యనారాయణ యాదవ్, గడ్డం చంద్రం గౌడ్, కల్వకొలను సతీష్ బట్, కొన్యాల నరసింహారెడ్డి, గంజి సూర్యనారాయణ, దండబోయిన వీరేష్ యాదవ్, ముక్కెర్ల శ్రీశైలం, గ్యాదపాక క్రాంతి, పాండు రాజు, ఉప్పలయ్య, భక్త కన్నప్ప, బుడిగే సత్తయ్య, పబ్బాల సాయి, చిరంజీవి, శివయ్య, ఎస్.కె నజీర్, కన్న రాజు, గడ్డమీది రాజాలు, బండ రామస్వామి, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.





## సత్యనారాయణ వ్రతం, కార్తీక వన భోజనాలు

జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 20:

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నేత్రపర్వంగా తులసీ దామోదర కల్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం యాదగిరిగుట్ట పరిధిలోని మల్లాపురం గోశాలలో దామోదర కల్యాణం,శ్రీ సత్యనారాయణ వ్రత మహోత్సవం, కార్తీక వనభోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య,ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ్మమూర్తి,ఆలయ ఈవో వెంకట్ రావు, యాదాద్రి ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, సీఐ భాస్కర్ పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీ నేతలు, దేవాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీ లక్ష్మి నరసింహ స్వామివారిని వేడుకున్నట్లు ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు.

## ఘనంగా వనమహోత్సవం



జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 20:

యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం దేవస్థానం గోశాలలో ఎస్పీఎఫ్ ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీక వనభోజనాల కార్యక్రమంలో భాగంగా ఖాళీ స్థలంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని, తద్వారా భావితరాలకు కాలుష్యం లేని వాతావరణాన్ని అందించిన వారమవుతామని వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎస్పీఎఫ్ ఎన్.శ్రీనాథ్, యాదాద్రి ఏసీపీ శ్రీనివాస్ నాయుడు. సీఎస్ వో శేషగిరిరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ్మమూర్తి, యాదగిరిగుట్ట ఆలయ ఈవో వెంకట్ రావు పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, పోలీసులు, ఎస్పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్టలో పెరిగిన కార్తీకమాసం ఆదాయం

- నెల రోజుల్లో రూ.17.62 కోట్లు వచ్చినట్లు ప్రకటన



జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 20:

తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి కార్తీక మాసం సందర్భంగా భారీగా ఆదాయం వచ్చింది. కార్తీక మాసంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దర్శనార్థం భారీగా భక్తులు తరలివచ్చారు. వివిధ శాఖల ద్వారా రూ.17,62,33,331 ఆదాయం వచ్చినట్లు యాదగిరిగుట్ట ఆలయ ఈవో వెంకట్ రావు వెల్లడించారు. గతేడాది 14,30,69,481 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.17,62,33,331 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.75,44,515, కల్యాణకట్ట ద్వారా రూ.18,05,200, బ్రేక్ దర్శనం ద్వారా రూ.76,84,200, వీఐపీ దర్శనం ద్వారా రూ.1,25,72,400, కొండపైన వాహన ప్రవేశం ద్వారా 1,31,79,995, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.16,28,100, ప్రసాద విక్రయం ద్వారా రూ.3,27,41,215తో పాటు వివిధ శాఖల ద్వారా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా స్వామివారిని 20,52,054 మంది భక్తులు దర్శించుకున్నారని, 24,447 సత్యనారాయణ వ్రతాలు జరిగాయని యాదగిరిగుట్ట ఆలయ ఈవో వెంకట్ రావు తెలిపారు.

## పరకాల మహిళా డైరీ పై సమీక్ష



జయభేరి, పరకాల, నవంబర్ 20:

గురువారం హనుమకొండ భవాని నగర్ లోని తన నివాసంలో పరకాల మహిళా పాల డైరీ పై అధికారులు, మహిళా పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ కార్యవర్గ సభ్యులతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరకాల మహిళా డెయిరీ విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, కార్యవర్గ సభ్యులు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని అన్నారు. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది అంటూ ఏమీ లేదని, మహిళలు ఆర్థికాభివృద్ధి చెందడం ద్వారా ఆ కుటుంబాలు ముందుకెళ్తాయన్నారు. మహిళలు ఐక్యమత్యంగా ఉండి అనేక రంగాలలో విజయవంతంగా ముందుకు వెళ్తున్నారని అన్నారు. మహిళలు పరస్పర సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తున్న ములుకనూరు మహిళా డెయిరీ మహిళా శక్తికి నిదర్శనం అని అన్నారు. ములుకనూరు డెయిరీ మాదిరిగానే పరకాల మహిళా డెయిరీ కూడా రానున్న రోజుల్లో విజయవంతంగా నడవాలన్నారు. పాల డెయిరీ నిర్వహణకు పట్టుదలతో పని చేసి స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. డైరీలో సభ్యుల సంఖ్య పెరిగే విధంగా అవగాహన కల్పించాలన్నారు.

# సమాజంలో ప్రేమ వివాహాలు నేరం కాదు

- మానవ మృగాలను వదిలిపెట్టె ప్రసక్తే లేదు
- ఎర్ర రాజశేఖర్ హత్యపై పూర్తిస్థాయి విచారణ జరిపిస్తాం
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ఎల్లంపల్లి గ్రామంలో హత్యకు గురైన రాజశేఖర్ కుటుంబానికి పరామర్శ
- తక్షణ సాయం కింద రూ. 50వేల చెక్కు అందజేత
- అట్రాసిటీ బాధితులకు ప్రభుత్వ సహకారమందేలా చూడాలని ఆర్డిఓకు ఆదేశం
- బాధిత కుటుంబానికి రెండు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- ఎర్ర రాజశేఖర్ హత్యను తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ పార్టీ



జయభేరి, షాద్ నగర్, నవంబర్ 20 :

సమాజంలో ప్రేమించి పెళ్లి చేసుకోవడం నేరం కానే కాదని, రాజ్యాంగం కల్పించిన హక్కును అదేవిధంగా పూర్తి స్వేచ్ఛ ప్రతి ఒక్కరికి వర్తిస్తుందని కుల ద్రహంకారంతో దళితుడు ఎర్ర రాజశేఖర్ ను హత్య చేయడం అత్యంత దారుణమని దీనిపై ప్రభుత్వం అత్యంత కఠిన చర్యలు తీసుకుని బాధితులకు అండగా నిలబడుతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామాన్ని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎస్సీ విభాగం కాంగ్రెస్ నాయకులు బాదేపల్లి సిద్ధార్థ, ఎస్సీ సెల్ అధ్యక్షులు కర్రోళ్ల సురేందర్, యువ నాయకుడు జాంగారి రవి, సీనియర్ నేత ఎర్రోళ్ల జగన్ సింగపాగ అనిల్ కుమార్ నాగి సాయిలు బొరిగి నరేందర్ ప్రధాన కార్యదర్శి జాంగారి జంగయ్య, కొమ్ము కృష్ణ తదితరుల ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బాలరాజు గౌడ్, యువ నేత కేకే కృష్ణ బీసీ సెల్ అధ్యక్షుడు జాకారం చంద్రశేఖర్ ఎల్లంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భవాని మల్లేష్ తదితరులు ఎమ్మెల్యే వెంటా గ్రామాన్ని సందర్శించారు.

రాజశేఖర్ కుటుంబాన్ని ఆదుకుంటాం..

హత్యకు గురైన దళితుడు ఎర్ర రాజశేఖర్ కుటుంబాన్ని అన్ని విధాల ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే వేలపల్లి శంకర్ స్పష్టం చేశారు. రాజశేఖర్ తండ్రి మల్లేష్, భార్య వాణి తదితర కుటుంబ సభ్యులతో ఆయన గ్రామంలో సమావేశం అయ్యారు. ఆ కుటుంబానికి తన సొంతంగా 50వేల రూపాయలు ఖర్చుల నిమిత్తం అందజేశారు. అట్రాసిటీ బాధితులకు ప్రభుత్వం నుండి రావాల్సిన బెనిఫిట్స్ను అందేలా చూడాలని ఆర్డిఓ సరితకు ఫోన్లో ఆదేశించారు. వెంటనే గ్రామాన్ని సందర్శించి వారికి ఉన్న సమస్యలు ప్రభుత్వపరంగా అన్ని తీర్చాలని వీరికి బ్యాంకు ఖాతా లేదని దానిని వెంటనే తెరిపించి వారికి బెనిఫిట్ సందేలా చూడాలని ఆర్డిఓకు ఎమ్మెల్యే ఫోన్ ద్వారా ఆదేశించారు.

సమాజంలో ఇలాంటి చర్యలను ఎవరు హర్షించరని ఒక దళితుడు ప్రేమించాడని అతన్ని ఘోరంగా చంపడం సభ్య సమాజం తలదించుకునే చర్య అని అన్నారు. సమాజంలో తనకు నచ్చిన విధంగా ప్రేమించడం తప్పు కాదని ఇద్దరు పరస్పరం ప్రేమించుకున్నప్పుడు ఆ తప్పు ఒకరిపై నెట్టి అతని చంపడం హేయమైన చర్యని ఖండించారు. రాజ్యాంగంలో అందరికీ పూర్తి స్వేచ్ఛ ఉందని ప్రేమించుకోవడం నేరం కానే కాదని ఆ మాటకొస్తే తన ఇంట్లో కూడా సభ్యులు ప్రేమ వివాహం చేసుకున్నారని సమాజంలో ఎంతోమంది ప్రేమ వివాహాలు చేసుకుని ఎంతో అన్యోన్యంగా జీవిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఎvర్ర రాజశేఖర్ ను హత్య చేసిన వారిని పోలీసులు వెంటనే పట్టుకొని ఎనిమిది మందిని రిమాండ్ కు తరలించడం జరిగిందని వారికి కోర్టులో శిక్ష పడేవిధంగా కూడా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అధికార యంత్రాంగం సహకరిస్తుందని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

చంద్రశేఖర్ కు రక్షణ కల్పిస్తాం

గ్రామానికి చెందిన ఇతర కులానికి చెందిన అమ్మాయి భవానీని వివాహం చేసుకున్న చంద్రశేఖర్ కు అతని కుటుంబానికి అందరికీ రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వాన్నిదని పోలీసులకు ఇదివరకే తాను ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం 50 వేల రూపాయల చెక్కును మృతుడి భార్య వాణి అదేవిధంగా తండ్రి మల్లేష్ చేతుల మీదుగా ఎమ్మెల్యే చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ అధ్యక్షుడు కరొల్ల సురేందర్, కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ సీనియర్ నేత బాధేపల్లి సిద్దార్థ, కాంగ్రెస్ పార్టీ ఎస్సి తాలూక యువ నేత జాంగారి రవి, ఎస్సి సెల్ సీనియర్ నేత ఎరోళ్ళ జగన్, టౌన్ ఎస్సి సెల్ అధ్యక్షుడు సింగపాగ అనిల్ కుమార్, ఫరూఖ్ నగర్ మండల ఎస్సి సెల్ అధ్యక్షుడు నాగి సాయిలు, కొందుర్గ్ ఎస్సి సెల్ అధ్యక్షుడు బోరిగే నరేందర్ , మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జాంగారి జంగయ్య, మాజీ సర్పంచ్ కొమ్ము కృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు బాబర్ అలీ ఖాన్,రఘు నాయక్, కృష్ణ రెడ్డి, తిరుపతి రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చల్ల శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, యువ నేత కేకే కృష్ణ, బిసి సెల్ అధ్యక్షుడు జాకరం చంద్ర శేఖర్, ఏల్లంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భవాని మల్లేష్, నేతలు రవీందర్ రెడ్డి, కుర్వా బాలరాజు , మామిడి జగన్ రెడ్డి, మహేష్ , గ్రామ ఎస్సి సెల్ అధ్యక్షుడు వేణు గోపాల్, కాంగ్రెస్ పార్టీ నేతలు కట్ట వెంకటేష్ గౌడ్ ,ఖదీర్, ముబరక్, అంబటి రాజు, వెంకటేష్ గుప్త, అబ్దుల్ సాజిద్, లింగారెడ్డి గూడ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ వాసులకు పండ్లు దుప్పట్ల పంపిణీ

జయభేరి, పరవాడ:

జీవీఎంసీ 79 వార్డు పరిధిలో లంకెలపాలెం శివారా శ్రీరామ నగర్ కాలనీ, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, ఉప్పర కాలనీలో సుమారు వంద మందికి చిట్టి బోయిన అప్పారావు పైడమ్మ , చిట్టిబోయిన కోటేశ్వరరావు ఆర్థిక సహాయంతో పేద ముసలివారికి చలి ఎక్కువగా ఉండడం గమనించిన చిట్టిపోయిన కుటుంబం వారు దుప్పట్లు,పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం చెప్పట్టడం పేదవాళ్లకి సహాయం చెయ్యడం చాలా మంచి కార్యక్రమం అని హర్షం వ్యక్తం చేశారు.



ఈ యొక్క కార్యక్రమంలో స్థానిక వార్డు నాయుకులు మంత్రి గిరిప్రసాద్, రమణ బాబు (పోస్ట్ మెన్), సునీత, రావాడ మాధవ్, దత్తు సతీష్ అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్కను అడ్డుకున్న రైతులు



జయభేరి, కామారెడ్డి:

రామారెడ్డి మండల కేంద్రంలో మంత్రి సీతక్క కు చేదు అనుభవం ఎదురయింది. రైతులు తక్షణమే బోనస్ చెల్లించాలని మంత్రిని అడ్డుకున్నారు. ధాన్యం కొనుగోలు చేయాలని నిలదీసారు. మంత్రికి, రైతులకు స్వల్ప వాగ్వాదం జరిగింది.తరువాత మంత్రి పోలీస్ బందోబస్తు మధ్య వెళ్లిపోయారు.

# తెలంగాణ ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకోవాలి

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ నియోజకవర్గం శివ గణేష్ పత్తి మిల్లులో పత్తి రైతులతో జనసేన పార్టీ ఇంచార్జ్ ఎస్బిఎస్ స్టేట్ ప్రెసిడెంట్ చందు నాయక్ పత్తి రైతుల గోసాలను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పత్తి రైతుల బాధలు సీసీఐ అధికారుల కాలు పట్టుకునే విధంగా ఉంది పక్క రాష్ట్రాం కర్ణాటకలో ఎకరానికి తొమ్మిది క్వింటలు కొంటే మన తెలంగాణ రాష్ట్రంలో గతానికంటే ఇప్పుడు సగానికి సగం కొని పరిస్థితి తీసుకొచ్చింది ఈ ప్రభుత్వం పెంచాల్సింది పోయి తగ్గించడమేంటి అన్ని పత్తి రైతులు వాపోతున్నారు ఒక రైతు ఒక ఎకరంలో 12 క్వింటాలు పత్తి పండితే ఎకరానికి ఏడు కింటలే కొనడం ఆ రైతు ఎన్నిసార్లు స్లాట్ బుక్ చేసుకోవాలి ఆ పత్తి మ్యాచర్ సరిగా రాకపోయినా స్లాట్ క్యాన్సిల్ కావడం రైతే రాజులు అన్న ఈ ప్రభుత్వం ఎందుకు వాళ్ళ కన్నీరుకు కారణమైంది ప్రభుత్వం ఈ ప్రభుత్వం దిగివచ్చి రైతులను పట్టించుకోవాల్సిన విషయాలు స్లాట్ రద్దు చేయడం ఒకలా చేసిన ఏడు నుంచి 15 క్వింటాలు కొనడం మ్యాచర్ 12 శాతం నుంచి 20% వరకు పెంచాలి బీబీ మోడ్ ఉన్న పత్తి మరియు కొంత మెక్ మోడ్ ఉన్న పత్తి సిసిఐ అధికారులు తీసుకొని పత్తి రైతులను ఆదుకోవాలి. దళారుల వ్యాపారం అరికట్టాలి. వర్షాలు పడి చేతికొచ్చిన పంట తేమ లేకుండా పోవడం అప్పటికే రైతుల గోసాలు వర్ణతీతంగా మారిన కూడా ఈ ప్రభుత్వం రైతుల విషయంలో దిగి రాకపోవడం పత్తి మిల్లులో పత్తి రైతుల కన్నీటి తో ఆవేదన చెందుతున్నారు అని చందు నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో పత్తి రైతులు తదితరులుపాల్గొన్నారు.



# రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జయభేరి, గార్ల, నవంబర్ 20:

మహబూబాబాద్ జిల్లా, గార్ల మండల కేంద్రంలోని స్థానిక నిర్మల హై స్కూల్ విద్యార్థులు నెట్ బాల్ రాష్ట్రస్థాయి పోటిలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ మెర్సీ, ప్రిన్సిపల్ జీన్సీ, ఫిజికల్ డైరెక్టర్ మాలత్ శేఖర్ లు తెలిపారు.నవంబర్ 9న నెల్లికుదురు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా నెట్ బాల్ అండర్ 17 విభాగంలో జరిగిన ఎంపికలలో షేక్.ఫెరోజు, ఏ.రీత్యుష్ లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. నవంబర్21 నుంచి 23వ తేదీ వరకు నల్గొండ జిల్లా,అనుమల మండలంలోని టైం స్కూల్లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో ఈ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.ఈ సందర్భంగా నెట్ బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నిర్మల స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్మిత,తెరిసా లిస్సి ఆన్సలిన్, రవి,నరేష్, శివకృష్ణ,సురేందర్,ప్రవీణ్, శ్రీనివాస్,జ్యోతి,సీని, శిరోమణి,రమణ,వాణి, కళ్యాణి,సరిత,కరుణా, సౌందర్య,నజియా,నందిని, ప్రణతి,ఆరోన్,బంగారమ్మ, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.




# చిత్స్వరూప!

తే.గీ. సర్వ భూతము లందున సత్స్వరూప
సిద్ధ రూపంబులో నున్న శుద్ధమూర్తి!
ఆర్తజన రక్ష్యకాయ!నే నంజలింతు
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!

తే.గీ. భూత నాథాయ!మమ్ముల బ్రోచుమయ్య
పుణ్య ఫలముల నొసగెడి పూర్ణపురుష!
దేవ దేవాయ!వేడితి దీనముగను
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!

తే.గీ. సాధుజన పోషకాయ!హే సత్స్వరూప!
పంచ భూతాత్మకాయ!హే పరమ శివుడ!
యజ్ఞ రూపాయ!ఈశ్వరా అంతరాత్మ!
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!

తే.గీ. సర్వరోగ నివారకా!శాంతి నొసగు
స్ఫూర్తి దాయకా!రక్షించు ఆర్తి తొలగ
శోక నాశకా!తప్పక శుభము లొసగు
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!

తే.గీ. సర్వలోక రక్షకుడవు సంస్తుతాయ!
సాక్షి భూతాయ!మా ఆత్మ సాక్షి వగుచు
కర్మ ఫలముల నిచ్చెడు నిర్మలాయ!
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!

ఆ.వె. మూల కారణాయ!ముఖ్యము నీ నామ
మదియె ప్రణవ మగును; ఆత్మ యందు
సంస్తుతింప నాదు జన్మ సాఫల్యమ్ము;
చేరి కొలుతు నిన్ను చిత్స్వరూప!



జక్కని వేంకటరాజం
సిరిసిల్ల. 94400 21734

# కాంగ్రెస్ లోకల్ కసరత్తు



జయభేరి, హైదరాబాద్, నవంబర్ 20:

లోకల్ పోరుకు ముందు తెలంగాణలో సరికొత్త రాజకీయం. అసలే నువ్వానేనా అన్నట్లుగా నడుస్తోన్న పొలిటికల్ ఫైట్‌లో..అప్పర్ హ్యాండ్ కోసం అటు కాంగ్రెస్.. ఇటు బీఆర్ఎస్ ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. పత్తి కొనుగోళ్ల కోసం సీసీఐ పెట్టిన రూల్స్‌లో రైతులు అవస్థలు పడుతున్నారని ఎక్స్‌పోజ్ చేస్తోంది బీఆర్ఎస్. గతంలోనూ స్థానిక ఎన్నికలకు సిద్ధమైన టైమ్‌లోనే యూరియా కొరత సర్కార్‌ను రోడ్డుకు ఈడ్చింది. ఇప్పుడు కాటన్ పాలిటిక్స్‌కు అధికార పార్టీని కలవరపెడుతున్నాయి. జూబ్లీహిల్స్ బైఎలక్షన్ హడావుడి అయిపోయింది. ఇక ఇప్పుడు రూరల్ తెలంగాణ మీద ఫోకస్ పెట్టింది బీఆర్ఎస్. అసలే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి. పైగా రైతుల సమస్యలు హైలెట్ చేస్తేనే తమకు ప్రజాదరణ దక్కుతుందని లెక్కలు వేసుకుంటోంది కారు పార్టీ. ఈ క్రమంలోనే ఆదిలాబాద్‌లో కేటీఆర్, వరంగల్‌లో హరీశ్‌రావు పత్తి రైతులను కలిసి వాళ్లు ఎదుర్కొంటున్న అవస్థలను తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలోనే పత్తి కొనుగోళ్ల అంశం పెద్ద దుమారమే రేపుతోంది. సీసీఐ.. పెడుతున్న కొర్రీలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ తమ గొంతు కలుపుతోంది.సరిగ్గా స్థానిక ఎన్నికలకు ముందు పత్తి కొనుగోళ్ల అంశం తెరమీదకు రావడంతో అధికార కాంగ్రెస్ ఆందోళన చెందుతోందట. గతంలోనూ కాంగ్రెస్ సర్కార్ లోకల్ బాడీ ఎన్నికలకు రెడీ అయిన టైమ్‌లోనే..యూరియా కష్టాలు అధికార పార్టీని కలవరపెట్టాయి. బస్తా యూరియా కోసం రైతులు రోడ్డెక్కి ఆందోళన చేయడం..అప్పటికి ఇప్పటికి తేడాను పోలుస్తూ బీఆర్ఎస్ అటాక్ చేసింది. దీంతో స్థానిక ఎన్నికలు పెడితే ఓడిపోవడం ఖాయమని ఎమ్మెల్యేలు తెగేసి చెప్పేయడంతో కాంగ్రెస్ సర్కార్ బ్యాక్ స్టెప్ వేసిందన్న టాక్ ఉంది.ఇప్పుడు మళ్లీ స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ రాబోతున్న వేళ పత్తి కొనుగోళ్ల ఇష్యూ చర్చకు దారి తీస్తోంది. ఇది కూడా రైతులకు ముడిపడిన అంశం. పైగా గ్రామీణ తెలంగాణలో ప్రభావం చూపిస్తుంది కూడా. అందుకే పత్తి కొనుగోళ్ల అంశాన్ని బీఆర్ఎస్ హైలెట్ చేస్తోందన్న చర్చ మొదలైంది. ఇదే అధికార పార్టీని కలవరపెడుతోందట. అయితే అప్పుడు యూరియా అయినా.. ఇప్పుడు పత్తి కొనుగోళ్లు అయినా రెండూ కేంద్ర పరిధి లోనివే. యూరియా పూర్తిగా కేంద్రం నుంచి రావాల్సి ఉన్నా..అడ్వాన్స్‌గా యూరియా తెప్పించుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం ఫెయిల్ అయిందన్న విమర్శలు వచ్చాయి. ఇప్పుడు పత్తి కొనుగోళ్లు కూడా కేంద్రం పరిధిలోని సీసీఐ పర్యవేక్షణలో కొనసాగుతోంది. సీసీఐ తీసుకొచ్చిన కొత్త నిబంధనలే తెలంగాణ రైతంగానికి శాపంగా మారాయంటున్నారు. అయితే నిబంధనలు పెట్టింది సీసీఐ అయినప్పటికీ..రాష్ట్ర వ్యవసాయ శాఖ ముందుగానే మేల్కొని ఉంటే ఈ ఇబ్బందులు వచ్చేవి కావంటోంది బీఆర్ఎస్. తమ హయాంలో రైతులకు చిన్న ఇబ్బంది రాకుండా జాగ్రత్తలు తీసుకున్నామని చెబుతోంది.

తేమ శాతం, ఫింగర్ ప్రింట్ విధానం అంటూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని దుమ్మెత్తిపోస్తోంది అపోజిషన్. తేమ శాతం, సీసీఐ నిబంధనలను సడలించే వరకు పోరాడుతామంటోంది బీఆర్ఎస్. అయితే అన్ని పార్టీల కంటే కారు పార్టీ పత్తి రైతుల అంశాలను హైలెట్ చేస్తోంది. అది కూడా లోకల్ బాడీ ఎన్నికలకు ముందు. రాబోయే రోజుల్లో ఎక్కడిక్కడ ధర్నాలు, రాస్తారోకోలకు బీఆర్ఎస్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే అధికార కాంగ్రెస్‌కు గుబులు పుట్టిస్తోంది.

అటో ఇటో జూబ్లీహిల్స్‌లో అయితే మంచి మెజార్టీతో గెలిచాం కానీ..స్థానిక ఎన్నికల్లో సత్తా చాటకపోతే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పుట్టి మునుగుతుందని టెన్షన్ పడుతోందట అధికార పార్టీ.తెలంగాణలో ఈసారి 45.32 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగైందని లెక్కలు చెబుతున్నాయి. 28.29 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వచ్చిందట. సీసీఐ కొత్త నిబంధనలే ఇప్పుడు పత్తి కొనుగోళ్ల పంచాయితీకి కారణమవుతున్నాయి. పత్తి కొనుగోలు చేసే జిన్నింగ్ మిల్లులకు గ్రేడింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది సీసీఐ. ఎల్ 1, ఎల్ 2 ఎల్ 3 విధానాన్ని తీసుకురావడంతో.. కొత్త తలనొప్పులు వచ్చాయి.తెలంగాణలో ఎకరాకు 10 నుంచి 14 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వస్తుంది.

కానీ ఎకరాకు 7 క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటామని షరతులు పెట్టింది సీసీఐ. జిన్నింగ్ మిల్లులు 325 ఉంటే..కొనుగోళ్లు చేసేందుకు 256 మిల్లులకు మాత్రమే పర్మిషన్ ఇచ్చింది. దీంతో సీజన్ ప్రారంభమై నెల రోజులైనా..ఇప్పటివరకు లక్ష క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. చాలా మిల్లుల దగ్గర కొనుగోలు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన బాట పడుతున్నారు. అన్నదాతలకు తోడుగా ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా రోడ్డెక్కుతోంది. ఇదే ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. లోకల్ పోరుకు ముందు కాటన్ పాలిటిక్స్ ఎలా ఎఫెక్ట్ చూపిస్తాయో చూడాలి.



## కేటీఆర్ పై కక్ష్య సాధింపు చర్యలు

జయభేరి, దేవరకొండ :

ఎలాంటి అవినీతి జరగని ఫార్ములా ఈ కార్ రేస్ లో విచారణకు ఏసీబీ అనుమతి ఇస్తూ గవర్నర్ అనుమతి తెలపడంతో కాంగ్రెస్ బీజేపీ లు బిఆర్ఎస్ పార్టీ పై కలిసి కుట్రలు చేస్తున్నాయనేది తేటతెల్లామైంది. బిఆర్ఎస్ ను కట్టడి చేయడానికి కేటీఆర్ గారిని ఎదుర్కోవడానికి రేవంత్ రెడ్డి, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయి ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల్లో ప్రభుత్వం పై తీవ్ర వ్యతిరేఖత వచ్చినపుడు, ఎలక్షన్ లు వచ్చినపుడు ఇలాంటి కేసుల అంశాన్ని తెరపైకి తెచ్చి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడు రెండేండ్లుగా ఫార్ములా ఈ రేస్ పై విచారణ పేరుతొ కొండను తవ్వి ఎలుకను పట్టలేకపోయారు. ఇప్పుడు మళ్ళీ స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకు కక్ష్యపూరిత రాజకీయాలకు కాంగ్రెస్ తెరలేపింది. అందులో భాగంగానే విచారణ పేరిట కేటీఆర్ ను ఇబ్బంది పెట్టాలని రేవంత్ రెడ్డి చూస్తున్నాడు. ఫార్ములా ఈ కార్ రేస్ తో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ని పెంచి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ వ్యాప్తం చేసిండు కేటీఆర్. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకులను కట్టడి చేయగలం అనుకోవడం పొరపాటే. మీరెన్ని అక్రమ కేసులు పెట్టిన ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు అయ్యేవరకు, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూనే ఉంటాం. కేటీఆర్ కి బిఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుంది. న్యాయస్థానాలపై మాకు పూర్తి నమ్మకం ఉంది..మీరు చేసే కుట్రలను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం.

## పేకాట స్థావరంపై దాడి, నలుగురు వ్యక్తుల అరెస్ట్



జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 20:

పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై తక్యుద్దీన్ తెలిపారు. గురువారం తుర్కపల్లి పోలీస్ స్టేషన్లో ఆయన మాట్లాడుతూ రూస్తాపురం గ్రామంలో గల ఒక ఓపెన్ ప్లేస్ లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను భూక్య భాస్కర్, జిన్నా జహంగీర్, జిన్నా వెంకటేష్, జిన్నా నరసింహ లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 4090 రూపాయల నగదు, నాలుగు సెల్ ఫోన్లు, రెండు సెట్ల పేకా ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

■ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, ఉప్పల్ :

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. రామంతపూర్ లో గల SV High School లో జరిగిన సైన్స్ ఫేర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. అనంతరం స్కూల్ లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫేర్ లో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు, BRS పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు, స్కూల్ యాజమాన్యం వెంకటేశ్వర్లు, విజయ BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.









## లయన్స్ క్లబ్ మెగా హెల్త్ క్యాంప్

జయభేరి, ఉప్పల్ :



లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, మీర్పేట్ వారి ఆధ్వర్యంలో అపోలో హాస్పిటల్, సీయోన్ కాన్సర్ క్లినిక్, ఎమ్ ఎస్ రెడ్డి లయన్ కంటి ఆసుపత్రి సహకారంతో మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సూర్య నగర్ కాలనీలోని మోడరన్ హై స్కూల్లో ఉచిత మెగా మెడికల్ హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్థానిక ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇన్నారెడ్డి విచ్చేసి ప్రారంభించారు. ఇట్టి మెగా హెల్త్ క్యాంప్ లో ఉచిత మందులతో సాధారణ ఆరోగ్య పరీక్షలు, దంత పరీక్షలు, కార్డియాలజీ, ఈ ఎన్ టి, ల్యాబ్ పరీక్షలు, కంటి పరీక్షలు, లాంటి అన్ని పరీక్షలు ఉచితంగా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మోడెర్న్ స్కూల్ యమాన్యం సచిదేవి, ముత్యంరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మీర్పేట్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి సభ్యులు రామచందర్, రమేష్, సత్యరెడ్డి, అంజిరెడ్డి మరియు స్థానికులు కోతి యాదగిరి గౌడ్, పద్మరెడ్డి, అంజయ్య, రవీందర్ రెడ్డి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.









## గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గ్రంథాలయాల వారోత్సవాలు

జయభేరి, దేవరకొండ :

తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల లో గ్రంథాలయాల వారోత్సవాలలో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించడం జరిగినది. ఈ వారోత్సవాలు 14వ తేదీ నవంబర్ నుండి 20వ తేదీ నవంబర్ వరకు విజయవంతంగా జరుపుకొని చివరి రోజున పుస్తక ప్రదర్శన నిర్వహించామని, ఈ ప్రదర్శనలో విద్యార్థినీలు అధ్యాపకులు గ్రంధాలయ నిర్వాహకులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. హరిప్రియ తెలియ చేసినారు.

## అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం



జయభేరి, చందంపేట :

జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి ఈ సందర్భముగా ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గోవిందు కొండయ్య మాట్లాడుతూ బాలలు గౌరవంతో జీవించాలని ప్రతి ఒక్కరు నాణ్యమైన విద్యను పొందాలని సంఘవిద్రోహశక్తుల నుండి అక్రమ రవాణా లైంగిక వేధింపులు లేకుండా రక్షణ పొందాలని చిన్నారులు ఆత్మవిశ్వాసము ఆనందము స్వభిమానము కలిగి సమానత్వ అవగాహనతో సురక్షిత వాతావరణంలో ప్రతి చిన్నారి కూడా భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోసెఫ్ చౌదరి రామచంద్రు ఎల్ మధు డాక్టర్ వెంకట్ విజయ సంధ్యారాణి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## శివలింగం ఆకారంలో దీపాల అలంకరణ

■ వివిధ రకముల పండ్ల రసములు, నవరత్నాములు, నాణాలు, సుగంధ ద్రవ్యములచే అభిషేకము



జయభేరి, దేవరకొండ :

శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కార్తీక మాసం చివరి రోజున ఆలయ ప్రధాన అర్చకులు ఘంటసాల సుబ్రహ్మణ్య శర్మ వారి శిష్య బృందంచే వివిధ రకముల పండ్ల రసములచే, నవరత్నాములచే, నాణేలచే సుగంధ ద్రవ్యములచే అభిషేకం తదుపరి దేవాలయం లోపల శివలింగం ఆకారంలో దీపాల అలంకరణ. ఆకాశ దీపారోహణ కార్యక్రమం ఆలయ కమిటీ వారు వైభవంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, గౌరవ అధ్యక్షులు పానగంటి మల్లయ్య, అధ్యక్షులు చీదెళ్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సముద్రాల ప్రభాకర్, కోశాధికారి కొత్త సుబ్బారావు ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన మండల స్పెషల్ ఆఫీసర్



జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 20:

తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ జానయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు రిజిస్టర్ను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే గోదాంలకు తరలించాలని అన్నారు.అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు.ఇందిరమ్మ గృహాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి మహేందర్, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, రైతులు పాల్గొన్నారు.



## ఉస్తాద్ భగత్‌సింగ్ వచ్చేది అప్పుడే..

ఈ ఏడాది రెండు నెలల తేడాతో రెండు సినిమాలతో పలకరించి అభిమానుల ఆకలి తీర్చేశారు పవన్‌కల్యాణ్. ముఖ్యంగా ఆయన 'ఓజీ' సినిమా బాక్సాఫీస్ దగ్గర చేసిన సందడి అంతా ఇంతా కాదు. ఈ స్పీడ్‌లోనే తన తదుపరి సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'కి సంబంధించిన తన పోర్షన్ మొత్తాన్నీ కూడా పూర్తి చేశారు వపన్ కల్యాణ్. అయితే.. పవన్ లేని సన్నివేశాలు కొన్ని ఇంకా మిగిలి ఉన్నాయి. దానికి సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలోనే మొదలుపెట్టనున్నారు. అలాగే డిసెంబర్ నుంచి ప్రమోషన్స్‌ను కూడా వేగవంతం చేయనున్నట్టు దర్శకుడు హరీశ్‌శంకర్ రీసెంట్‌గా పేర్కొన్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమా రిలీజ్ విషయంలో కూడా నిర్మాతల్లో ఒకరైన రవిశంకర్ ఇటీవలే క్లారిటీ ఇచ్చారు. 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రాన్ని ఏప్రిల్‌లో విడుదల చేయనున్నట్టు ఆయన ప్రకటించారు. జనవరిలో చిరంజీవి 'మన శంకర వరప్రసాద్‌గారు', మార్చిలో రామ్‌చరణ్ 'పెద్ది' రిలీజ్‌లు ఉన్న విషయం తెలిసిందే. వాటి తర్వాతే 'ఉస్తాద్ భగత్‌సింగ్'ని విడుదల చేయడం సబబుగా ఉంటుందని చిత్రబృందం భావించారట. ఈ లోపు మిగిలిన పార్ట్‌ను, పోస్ట్ ప్రొడక్షన్‌నూ పూర్తిచేస్తారట.

## ఇదో కొత్త జంట ప్రయాణం



'ప్రేమ రెండు రకాలుగా అర్థమవుతుంది. మన కవులు, దర్శకులు చెప్పిన థియరీ ప్రకారం అది ఒకలా అర్థమైతే.. ప్రేమలో ఉన్నప్పుడు, అది విఫలమైనప్పుడు, పెళ్లయ్యాక మరోలా అర్థమవుతుంది. నిజానికి ప్రేమ అంటే ఓ అప్లికేషన్. అది ఎక్కువసార్లు పెళ్లి ద్వారానే అర్థమవుతుంది.' అని హీరో ప్రియదర్శి అన్నారు. ఆయన, ఆనంది జంటగా నటించిన రొమాంటిక్ లవ్‌స్టోరీ 'ప్రేమంటే'. నవనీత్ శ్రీరామ్ దర్శకుడు. పుస్కూర్ రామ్మోహన్‌రావు, జాన్వీ నారంగ్ నిర్మాతలు. శుక్రవారం సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రియదర్శి గురువారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. 'సినిమా బాగా వచ్చింది. చూసినవారంతా మెచ్చుకున్నారు. ఇష్టపడి పెళ్లాడిన తర్వాత మొదలయ్యే జీవితంలో చాలా డైనమిక్స్ మారుతాయి. ప్రేమంటే ఇంత బావుంటుందా? అనుకోవడంతోపాటు ఇలా కూడా ఉంటుందా? అనిపిస్తుంది జీవితం. దాన్నే తెరపై చూపించాం. ప్రేమించి పెళ్లాడిన జంట కలిసి చేసే ప్రయాణంలో ఎత్తుపల్లాలు.. కుదుపులు.. ఆటుపోట్లు సర్వసాధారణం. అందులో ఓ వినోదం కూడా ఉంటుంది. ఆ వినోదాన్నే ఈ సినిమాలో ఎక్స్‌పీరియన్స్ చేస్తారు. అలాగే సందేశాన్ని కూడా తీసుకోవచ్చు.' అని పేర్కొన్నారు ప్రియదర్శి. ఆనంది అద్భుతమైన నటి అని, అలాగే సుమ లాంటి టాప్ యాంకర్‌ని యాక్టర్‌గా చూడటం ఓ గొప్ప అనుభవమని, దర్శకుడు నవనీత్ క్లారిటీతో, మెచ్యూరిటీతో సినిమా తీశాడని ప్రియదర్శి తెలిపారు. చేయబోతున్న సినిమాల గురించి చెబుతూ ''అసమర్థుడు' అనే సినిమా చేస్తున్నా. ఇది పొలిటికల్ థ్రిల్లర్. అలాగే థ్రిల్లర్ జోనర్‌లో 'సుయోధన' అనే సినిమా చేస్తున్నా.' ఆ సినిమాలకు సంబంధించిన వివరాలు త్వరలోనే తెలియజేస్తాం.' అని చెప్పారు ప్రియదర్శి.



## ఇది ఆరంభం మాత్రమే!

'నా కోసం ఎలాంటి కథలు రాసిపెట్టున్నాయో తెలియదు. అయితే ప్రతీ క్యారెక్టర్‌కు వందశాతం న్యాయం చేయాలని తపిస్తాను. 'అరుంధతి'లో అనుష్క చేసిన జేజమ్మలాంటి పాత్రలు చేయాలన్నది నా కోరిక' అని చెప్పింది భాగ్యశ్రీబోర్సే. 'మిస్టర్‌బచ్చన్' 'కింగ్డమ్' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈ భామ నటించిన తాజా చిత్రం 'ఆంధ్రాకింగ్ తాలూకా'. రామ్ హీరోగా నటించిన ఈ చిత్రానికి మహేష్‌బాబు పి దర్శకుడు. ఈ నెల 27న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం చిత్ర కథానాయిక భాగ్యశ్రీ బోర్సే పాత్రికేయులతో ముచ్చటించింది. ఈ సినిమాలో తాను మహాలక్ష్మి అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, అందరూ గుర్తుపెట్టుకునే క్యారెక్టర్ అవుతుందని చెప్పింది. 'ఇదొక హీరో అభిమాని కథ. దక్షిణాదికి వచ్చాక ఇక్కడ హీరోలను ఏ స్థాయిలో ఆరాధిస్తారో తెలుసుకున్నా. ఎలాంటి సంబంధం లేకుండా ఓ వ్యక్తిని అంతలా ఎలా ప్రేమిస్తారో అని ఆశ్చర్యపోయా. అభిమానం అనేది డివైన్ ఎమోషన్' అని చెప్పింది. ఇటీవల విడుదలైన 'కాంత' చిత్రంలో తన అభినయానికి మంచి స్పందన లభించిందని, ప్రేక్షకులు నటిగా తన ప్రతిభను గుర్తించారని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని, భవిష్యత్తులో నటిగా సవాళ్లకు సిద్ధంగా ఉన్నానని భాగ్యశ్రీబోర్సే పేర్కొంది.

## స్పైథ్రిల్లర్ చిత్రంలో ప్రియాంక

ప్రియాంక మోహన్ కన్నడంలో బంపరాఫర్‌ను దక్కించుకుంది. 'సప్తసాగరాలు దాటి' ఫేమ్ దర్శకుడు హేమంత్ రావు డైరెక్షన్‌లో '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' పేరుతో ఓ స్పై థ్రిల్లర్ తెరకెక్కనుంది. ధనంజయ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్ కీలకమైన అతిథి పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా సెట్స్‌లో ప్రియాంక మోహన్ జాయిన్ అయింది. ఈ విషయాన్ని సోషల్‌మీడియా ద్వారా వెల్లడించారు మేకర్స్. 1980 దశకంలో నడిచే ఈ పీరియాడిక్ కథలో ప్రియాంక మోహన్ పాత్ర నవ్యరీతిలో ఉంటుందని చెబుతున్నారు. శివరాజ్‌కుమార్‌గారి సినిమాలు చూస్తూ పెరిగానని, ఆయన సినిమాలో భాగం కావడంతో తన కల నిజమైందని, కన్నడంలో తనకు బ్రేక్‌నిచ్చే చిత్రమవుతుందని ప్రియాంక మోహన్ ఆనందం వ్యక్తం చేసింది.



## రాంచరణ్ గురించి ఆసక్తికరమైన విషయం షేర్ చేసిన మెగాస్టార్..



ఒకప్పుడు థియేటర్లలో ఈలలు కొట్టించిన మాస్ మాస్టర్‌పీస్‌లు మళ్లీ తెర మీద సందడి చేస్తున్నాయి. మెగాస్టార్ చిరంజీవి నటించిన సినిమాలు వరుసగా రీరిలీజ్ అవుతూ మెగా అభిమానులను ఉర్రూతలూగిస్తున్నాయి. 'జగదేక వీరుడు అతిలోకసుందరి', 'గ్యాంగ్ లీడర్', ఇప్పుడు 'కొదమసింహం'... రీరిలీజ్‌ల పరంపర కొనసాగుతూనే ఉంది. 90ల మాయ మళ్లీ స్క్రీన్‌పై కనిపిస్తుండగా కొత్త జనరేషన్ ఆశ్చర్యపోతోంది. టికెట్ రేట్లు పెరిగినా హౌస్‌ఫుల్ బోర్డులు... అదే మ్యాజిక్! ఈ ట్రెండ్ చూస్తే మరిన్ని సినిమాలు కూడా లైన్‌లో ఉన్నట్టున్నాయి. నాస్టాల్జియా ఇప్పుడు కలెక్షన్ల కరెన్సీగా మారింది. థియేటర్లు మళ్లీ 90ల్లోకి టైమ్ ట్రావెల్ చేస్తున్నాయి! తాజాగా మెగాస్టార్ చిరంజీవి నటించిన కొదమ సింహం సినిమా రీరిలీజ్కి సిద్ధమైంది. మెగాస్టార్ కెరీర్‌లో 150కి పైగా చిత్రాల్లో నటించగా వాటిలో అనేక బ్లాక్‌బస్టర్లు ఉన్నాయి. 1990లలో విడుదలైన 'కొదమ సింహం' ఆయన కెరీర్‌లో మరో మైలురాయి. ఈ కౌబాయ్ యాక్షన్ చిత్రం, కృష్ణ నటించిన 'మోసగాళ్లకు మోసగాడు' (1971) తర్వాత తెలుగులో వచ్చిన మరో సంచలన కౌబాయ్ మాస్టర్‌పీస్. ఈ సినిమా 35 ఏళ్ల తర్వాత, ఈ నెల 21న రీరిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా చిరంజీవి తన స్పెషల్ వీడియో మెసేజ్ ద్వారా పాత జ్ఞాపకాలను పంచుకున్నారు.

**పాట పెడితేనే భోజనం..**

విడుదల సమయంలో 'కొదమసింహం' భారీ హిట్. బాక్సాఫీస్ వద్ద 10 కోట్లు పైగా కలెక్ట్ చేసి, అప్పటి రికార్డులను బద్దలు కొట్టింది. చిరంజీవి తొలిసారి గడ్డం పెంచి, కౌబాయ్ లుక్‌లో నటించిన సినిమా చరిత్ర సృష్టించింది. మోహన్‌బాబు పోషించిన 'సుడిగాలి' పాత్ర చిరంజీవి ఫేవరెట్. 'ఆ పాత్రకు మోహన్‌బాబు తప్ప మరెవరూ న్యాయం చేయలేరు' అని చిరంజీవి స్వయంగా మోహన్బాబుని ప్రశంసించారు.

లెజెండరీ నటుడు ప్రాణ్‌తో కలిసి పనిచేయడం అదృష్టమని, ఆ సీన్స్ ఇప్పటికీ మర్చిపోలేనినని అన్నారు. కౌబాయ్ థీమ్ అప్పటి తెలుగు సినిమాలో అసాధారణం. చిరంజీవి మొదట అది సాహసమని అనుకున్నారట, కానీ కథ నచ్చి వెంటనే ఓకే చెప్పారట.

కొదమసింహం సినిమా రీరిలీజ్ సందర్భంగా విడుదల చేసిన ఒక వీడియోలో చిరంజీవి మాట్లాడుతూ.. 'కౌబాయ్ సినిమాలు నాకు ఇష్టమే, కానీ ఇలాంటిది చేస్తానని ఊహించలేదు. చరణ్ భోజనం చేయాలంటే వాళ్లమ్మ ఈ క్యాసెట్ పెట్టాల్సిందే. ఈ సినిమా పాటలు పెడితే తప్ప తినేవాడు కాదు' అంటూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. రీరిలీజ్‌తో కొత్త తరానికి 90ల మాస్ ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తుందని అన్నారు చిరంజీవి. కొదమసింహం రీరిలీజ్ మెగా అభిమానులకు అదిరిపోయే మాస్ ట్రీట్ ఇచ్చేందుకు వచ్చేస్తోంది!

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**